ఈనాడు
సంగారెడ్డి
గురువారం 17 ఆగస్టు 2017
16 పేజీలు

జవజీవాలు... ఉత్తిమాటేనా!


ఇటీవల మనూరుకు లారీలో వచ్చిన గొర్రెలు

కనీసం నడవడం లేదంటున్న లబ్ధిదారులు

ఆరోగ్యంగా ఉన్నవి పంపిణీ చేయాలని వినతి

మరణించిన వాటి లెక్కల్లోనూ పొంతన కుదరట్లేదు

అధికారులు దృష్టిసారించాల్సిన సమయం ఇదే

ఈనాడు, సంగారెడ్డి,
న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, మనూరు

గ్రామాల్లోని గొల్లకుర్మలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 18 ఏళ్లు నిండి అర్హులైన లబ్ధిదారులకు 20 గొర్రెలు, ఒక పొట్టేలును అందిస్తోంది. యూనిట్ విలువ రూ.1.25 లక్షలుగా ఉంది. ఇందులో 75 శాతంతో రూ. 93,750లను ప్రభుత్వం భరిస్తుండగా... మిగతా 25 శాతం వాటి అంటే రూ.31,250 లబ్ధిదారులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో 11,446 యాదవ కుటుంబాలు ఉండగా వారి జనాభా 48,846గా ఉంది. జిల్లావ్యాప్తంగా ఏర్పడిన 503 సంఘాల్లో 30,896 మంది సభ్యులుగా చేరారు. ఇందులో తొలి విడతలో 15,551 యూనిట్లకు గొర్రెలు పంపిణీ చేయడానికి అధికారులు సమాయత్తం చేశారు. వచ్చే ఏడాది రెండో విడతలో 15,345 యూనిట్ల పంపిణీ లక్ష్యం ఉండగా ఇప్పటికి రూ.32 కోట్ల ఖర్చుతో 2,898 యునిట్లను మాత్రమే ఇవ్వగలిగారు. కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి గొర్రెలను కొనుగోలు చేస్తున్నారు. అక్కడ అవసరమైన మేర జీవాలు అందుబాటులో లేకపోవడంతో పంపిణీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఇక ఇప్పటికే అందించిన వాటిలో చాలావరకు రోగాల బారిన పడుతున్నాయి. కొన్నిచోట్ల ఇవి మృత్యువాతపడుతుండగా... మరికొన్ని చోట్ల కనీసం నడవలేకపోతున్నాయని లబ్ధిదారులు ఆవేదనగా చెబుతున్నారు. గడ్డి వేయడం లేదని, చాలా నీరసంగా ఉంటున్నాయని వివరిస్తున్నారు. పంపిణీ చేసిన చాలాచోట్ల క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించగా పదుల సంఖ్యలో గొర్రెలు చనిపోయినట్లుగా స్పష్టమవుతోంది.

లెక్కల్లో కుదరని పొంతన

లబ్ధిదారులకు ఇప్పటివరకు పంపిణీ చేసిన తర్వాత 11, రవాణా సమయంలో మరో పది గొర్రెలు

...మిగతా 7లో

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి


చనిపోయిన గొర్రెలను చూపుతున్న విష్ణు

కనీసం తొమ్మిది నెలల నుంచి రెండేళ్ల వయసున్న పొట్టేలును లబ్ధిదారులకు అందించాలి. చాలాచోట్ల అంతకన్నా చిన్నది లేదా వయసు ఎక్కువగా ఉన్న పొట్టేలునే ఇస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. పంపిణీ చేయడానికి అవసరమైన మేరకు గొర్రెలు లేకపోవడం, వేచి చూడాల్సి వస్తుందనే కారణంతోనూ అధికారులు చూపిన వాటినే తీసుకోవడానికి అంగీకరిస్తున్నారు. దీంతో అనారోగ్యంగా ఉన్నవి, వయసు మళ్లిన వాటిని కూడా లబ్ధిదారులకు అంటగడుతున్నట్లుగా స్పష్టమవుతోంది. తెచ్చిన కొద్దిరోజులకే రోగాల బారినపడుతుండటంతోపాటు నడవలేని పరిస్థితికి చేరుకుంటున్నాయని వాటిని అందుకున్న వారు వివరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి మంచి గొర్రెలను పంపిణీ చేసేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రోగాలు వస్తే వాటికి తక్షణం మందులు ఇవ్వడంతో పాటు మళ్లీ రోగం తిరగబెట్టకుండాచికిత్సలు అందించాలంటున్నారు.

ఫొటో తీయండి... వాట్సాప్ చేయండి

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

మీకు ఫొటోగ్రఫీ అంటే ఇష్టమా.. మంచి దృశ్యాలు కనిపించగానే కెమెరాలో బంధిస్తారా.. మానవీయం ప్రతిబింబించే ఛాయాచిత్రాలనూ తీయగలరా. ప్రకృతి రమణీయతను దృశ్యరూపంలో చూపగలరా... అలాగైతే మీ కెమెరాలో బంధించిన చిత్రాలను మాకు వాట్సప్ చేయండి. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఈనెల 19న మీరు తీసిన ఫొటోలను 'ఈనాడు'లో ప్రచురిస్తాం. మీరు తీసిన ఛాయాచిత్రంతో పాటు మీ పాస్‌పోర్టు సైజు ఫొటోను సైతం పంపండి. మానవీయం, ఆహ్లాదం, ఆకట్టుకునేలా ఉండే వాటికే ప్రాధాన్యం ఉంటుంది. ఎంపిక, ప్రచురణలో తుది నిర్ణయం మాదే. ఇంకెందుకు ఆలస్యం కెమెరాకు పనిచెప్పండి. ఫొటోలు వాట్సప్‌లో పంపండి. మీ పేరు, చిరునామా జతచేయండి.

ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నంబర్లు	ఎప్పటిలోగా పంపాలంటే
8008573236, 9848678897	ఆగస్టు 18 (శుక్రవారం) మధ్యాహ్నం 2గంటల్లోపు

నేటి నుంచి తట్టు, రుబెల్లాకు టీకాలు



సంగారెడ్డి అర్బన్: తట్టు, రుబెల్లా టీకాల కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గురువారం జిల్లావ్యాప్తంగా కార్యక్రమానికి శ్రీకారం చెట్టేందుకు వైద్యా రోగ్యశాఖ సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి సెప్టెంబర్ 23 వరకు కార్యక్రమాన్ని కొనసాగిస్తుంది. 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలకు టీకాలు వేయనున్నారు. ఈ వర్గంలో జిల్లావ్యాప్తంగా 4,00,792 మంది చిన్నారులు ఉన్నట్లుగా వైద్యాధికారులు గుర్తించారు. ఆరోగ్య శాఖలో పని చేస్తున్న 358 మంది ఏఎన్ఎంలు కలిసి... 1,825 పాఠశాలలు, 1,504 అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకాలు వేస్తారంటూ జిల్లా వైద్యాధికారి మోజీరాం రాథోడ్ తెలిపారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో గురువారం జిల్లా పాలనాధికారి మాణిక్కరాజ్ చేతుల మీదుగా చిన్నారులకు టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామంటూ ఆయన వివరించారు.

లక్ష్యం దిశగా... వేగంగా అడుగులు

- రెవెన్యూ సమస్యల రహిత జిల్లాగా ప్రకటించేలా కార్యాచరణ
- 304 గ్రామాల్లో దస్త్రాలను సవరించిన యంత్రాంగం
- మరో 68 ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే


ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ఈనాడు, సంగారెడ్డి

రెవెన్యూ రికార్డుల్లో తప్పులుంటే రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి వాటిని సరిచేయించుకోవాలి. అది వారి పని కాదు... మనమే ఇంటింటికీ వెళ్లి తప్పులను సరిదిద్దాలని ఉన్నతాధికారులు రెవెన్యూ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం పక్కా ప్రణాళిక కారణంగా చక్కని ఫలితాన్నిస్తోంది. రానున్న రోజుల్లో సంగారెడ్డిని రెవెన్యూ సమస్యలు లేని జిల్లాగా మార్చేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. పహాణీల్లో తప్పులను సరిచేసుకోలేక ఇన్నాళ్లూ అవస్థలు పడిన రైతుల బాధలు తీరిపోతుండటంతో వారూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి సగం రెవెన్యూ గ్రామాల్లో రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా సరిచేయాలన్న లక్ష్యంతో పనిచేసిన రెవెన్యూ యంత్రాంగం దానిని సాధించింది. ఈ సందర్భంగా 'ఈనాడు' అందిస్తున్న కథనమిది...

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 600 రెవెన్యూ గ్రామాలున్నాయి. ప్రతి గ్రామంలోనూ

...మిగతా 7లో

ఉపకారం అందేదెప్పుడు..?

మహిళా సంఘాల సభ్యుల పిల్లల ఎదురుచూపులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

మహిళా సంఘాల్లో చేరితే అన్ని విధాలా ప్రయోజనం ఉంటుంది. పొదుపుతో ఆర్థిక ఉన్నతికి బాటలు వేసుకోవడంతో పాటు.. పిల్లలను బాగా చదివించుకోవచ్చు. ఇదే ఉద్దేశంతో మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆయా సంఘాల సభ్యులకు చేకూరాల్సిన ప్రయోజనం విషయంలో జాప్యం జరుగుతోంది. దీంతో సభ్యులుగా ఉన్న మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అభయ హస్తం పథకం కింద సభ్యులుగా ఉన్న వారి పిల్లల ఉపకార వేతనాల విషయంలో ఇదే జరుగుతోంది. దీనిపై 'న్యూస్‌టుడే' కథనం.



2014-15 సంవత్సరానికి ఉపకార వేతనాల చెక్కును అందజేస్తున్న పాలనాధికారి (పాతచిత్రం)

జాప్యంతో ఇబ్బందులు

అభయహస్తం పథకంలో సభ్యులుగా చేరిన మహిళా సంఘాల సభ్యులకు 60 సంవత్సరాలు దాటగానే నెలకు రూ.500 చొప్పున పింఛను అందజేస్తారు. దీంతోపాటు సభ్యులుగా చేరినప్పటి నుంచే వారి పిల్లల చదువులకు చేయూత ఇవ్వాలన్న ఉద్దేశంతో ఉపకార వేతనాలు కూడా మంజూరు చేస్తారు. ఉపకార వేతనాలు అందించి పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు.. వారి పిల్లల చదువులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే గత రెండేళ్లుగా ఉపకార వేతనాలు అందని పరిస్థితి నెలకొంది.. ఉపకార వేతనాలు ఎప్పుడు అందుతాయా అని ఎదురు చూడాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014-15 వరకు ఉపకార వేతనాలు సక్రమంగానే అందినా.. ఆ ఊసేలేదు. నేరుగా విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో ఉపకార వేతనాలకు సంబంధించిన సొమ్ము జమ చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో ఉపకార వేతనాల పంపిణీ తీరు..

సంవత్సరం	విద్యార్థులు	మంజూరు
2013-14	56,275(ఉమ్మడి జిల్లా)	రూ. 6.60 కోట్లు
2014-15	15,187(సంగారెడ్డిజిల్లా)	రూ. 1.82 కోట్లు
2015-16	12,920	-

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినా..

2015-16 విద్యా సంవత్సరానికి సంబంధించిన లబ్ధిదారులను ఇప్పటికే గుర్తించారు. 12,920 మంది లబ్ధిదారులకు సంబంధించిన బ్యాంకు ఖాతా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కూడా పూర్తిచేశారు. ఈ వివరాల ఆధారంగా ఆయా లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో ఉపకార వేతనాలకు సంబంధించిన మొత్తాన్ని జమ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు నిధులు విడుదల కాకపోవటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2016-17 విద్యా సంవత్సరానికి సంబంధించి లబ్ధిదారుల వివరాలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందకపోవటంతో ఆ ప్రక్రియ ముందుకు సాగటం లేదు.

నిధులు మంజూరు కావాల్సి ఉంది

– మోహన్, డీపీఎం, (ఐకేపీ)

2015-16 సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ప్రభుత్వం నుంచి ఉపకార వేతనాలకు సంబంధించిన నిధులు విడుదల కావాల్సి ఉంది. నిధులు విడుదల కాగానే విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తాం. గత విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల వివరాల నమోదు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

పాఠశాలకు రాకుండానే ప్రతి నెలా జీతం..!

నాగల్‌గిద్ద మండలంలో వెలుగులోకి..

మనూరు, న్యూస్‌టుడే: పాఠశాలకు రాకుండానే ప్రతి నెలా ఉపాధ్యాయురాలు జీతం తీసుకున్న సంఘటన నాగల్‌గిద్ద మండల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తండావాసులు తెలిపిన ప్రకారం, 'న్యూస్‌టుడే' పరిశీలించగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. మండలంలోని పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు మెడికల్ సెలవని గత విద్యా సంవత్సరం జనవరి సగం రోజుల నుంచి అదే విద్యా సంవత్సరం పాఠశాల ముగింపు ఏప్రిల్ వరకు విధులకు హాజరు కాలేదు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడికి సమాచారం ఇవ్వలేదు. దీంతో ఆయన ఎంఆర్సీకి పంపిన జాబితాలో హాజరు కాలేదని చూపించారు. ఎంఈఓ మాత్రం మెటర్నటి లివ్ అని చెప్పి జనవరి-2017 నుంచి ఏప్రిల్ 2017 వరకు జీతం చెల్లించేశారు. స్థానిక పాఠశాలలోని హాజరు రిజిష్టర్‌లో మాత్రం జనవరి నుంచి ఏప్రిల్ వరకు వచ్చినట్లుగా హాజరు నమోదయి ఉంది. ఇక ఈ ఏడాది జూన్ నుంచి సదరు ఉపాధ్యాయురాలు పాఠశాలకు సక్రమంగా రావడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యాధికారి పట్టించుకోకపోవడం వల్ల ఈ దుస్థితి తలెత్తుతోందని వాపోతున్నారు. ఈ విషయమై సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని వివరణ కోరగా.. జనవరి సంక్రాతి సెలవుల నుంచి ఉపాధ్యాయురాలు విధులకు హాజరు కాలేదని, ఏప్రిల్ ముగింపున ఒక రోజు మాత్రమే వచ్చారన్నారు. అనంతరం వేసవి సెలవులు వచ్చాయని చెప్పారు. ఆమె సెలవుపై వెళ్లుతున్నట్లు సమాచారం ఇవ్వలేదని చెప్పారు. ఉపాధ్యాయురాలిని వివరణ కోరగా మెడికల్ సెలవుపై వెళ్లానని, హాజరు రిజిస్టర్‌లో అన్ని ఒకే రోజు సంతకాలు చేసి తప్పు చేశానని అంగీకరించారు. ఎంఈఓ వివరణ కోరగా సెలవు పెట్టడంతో జీతం చెల్లించానని చెప్పారు. అయినా పాఠశాలకు వెళ్లి పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలా ముగ్గురి వివరణలు పొంతన లేనివిగా ఉండడం, అనుమానాలకు తావిస్తోంది. పూర్తి విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందని పలువురు కోరుతున్నారు.

సైన్స్‌పై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింలు

నర్సాపూర్ రూరల్: సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి నర్సింలు సూచించారు. బుధవారం నర్సాపూర్‌లో సంఘం జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశం ఎల్లంకి డిగ్రీ కళాశాలలో జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సైన్స్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్లీనరీ అక్టోబరు 14, 15 తేదీలలో తుప్రాన్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 27న ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అనంతరం స్వర్గీయ శాస్త్రవేత్త పీఎం భార్గవకు సంతాపం తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి పండరి, మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

డీఎడ్‌లో సీటు రాలేదని విద్యార్థిని ఆత్మహత్య

చేగుంట: డీఎడ్‌లో సీటు రాలేదన్న మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట మండలం రెడ్డిపల్లిలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానిక ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్పిడి రాజు కుమార్తె ఇందు (19) చేగుంటలో తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ పూర్తిచేసి ఉత్తీర్ణత సాధించింది. డీఎడ్‌లో చేరాలనే ఉద్దేశంతో జూన్ 17 ప్రవేశ పరీక్ష రాసింది. గత నెలలో ఫలితాలు రాగా 3,200 ర్యాంకు వచ్చింది. సీటు వస్తుందనే నమ్మకంతో డిగ్రీలో సైతం చేరలేదు. గత నెలలోనే ధ్రువపత్రాల పరిశీలనకు సైతం వెళ్లారు. సీటు అలాట్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో కళాశాలలను సైతం ఎంచుకోగా.. ఈ నెల 10న సీటు అలాట్‌మెంట్‌లో ఆమెకు ఏ డీఎడ్ కళాశాలలో కన్వీనర్ కోటాలో సీటు దక్కలేదు. అటు డిగ్రీలో చేరకపోవటం, ఇటు డీఎడ్‌లో సీటు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో కుటుంబసభ్యులు గ్రామంలో జరిగిన వివాహ శుభకార్యాలకు వెళ్లారు. తనకు తలనొప్పి ఉందని చెప్పి ఇంట్లోనే ఉంది. ఆ తర్వాత కొద్ది సేపటికి శరీరంపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృతురాలి తల్లి యాదమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ వివరించారు.



ఇందు (పాతచిత్రం)

పరిశ్రమిస్తేనే... కష్టం తెలిసేది!



కూరగాయల తోటలో కలుపుతీస్తున్న విద్యార్థులు

ఈనాడు, సంగారెడ్డి

పొలంలో శ్రమించే అన్నదాతలకు అండగా నిలవాలంటే ముందుగా వారి కష్టనష్టాలు ఏంటో తెలుసుకోవాలి. అందివచ్చిన సాంకేతికతను సద్వినియోగం చేసుకొని రైతులకు మేలు జరిగేలా చూడాలి. ఇవే విషయాలను నేర్పేందుకు మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలో ఉన్న డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థలో విద్యార్థులను బృందాలుగా విభజించి పంటలు సాగు చేసే బాధ్యతలను అప్పగిస్తున్నారు. వారే అన్ని పనులూ చేస్తూ సాగులో ఉండే కష్టనష్టాలను తెలుసుకుంటున్నారు. నాట్లు వేసే దగ్గర నుంచి కోతలు కోసే వరకు ఇలా పొలంలో చెమటలు చిందిస్తున్నారు. మరికొందరు కూరగాయల తోటల్లో కలుపుతీసే పనిలో నిమగ్నమవుతున్నారు. సాగు మొదలుపెట్టినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు విద్యార్థులే చూసుకుంటారని కళాశాల నిర్వాహకులు వివరిస్తున్నారు. పంటల ఉత్పత్తులు అమ్మగా వచ్చిన లాభంలోనూ వారికి వాటా ఇస్తామంటున్నారు. పేద విద్యార్థులకు వ్యవసాయంలో మెలకువలను పెంచేలా ఆరునెలలపాటు ఉచిత కోర్సునూ అందిస్తున్నారు. పాఠాలతో పాటు అందులో ఉన్న సారాన్ని అనుభవపూర్వకంగా నేర్పిస్తుండటంతో ఇక్కడ చదివిన 88 మంది విద్యార్థులు ఇటీవల వ్యవసాయ విస్తరణాధికారులుగా కొలువులు దక్కించుకోవడం విశేషం.

గంజాయి పండించినా, తరలించినా కఠిన చర్యలు



గంజాయి సాగు చేసిన చేనులో పోలీసులు

కంగ్టి: అక్రమంగా గంజాయి పండించినా, తరలించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కంగ్టి సీఐ తిరుపతియాదవ్ హెచ్చరించారు. సమాచారం మేరకు మండలంలోని ఎన్కమూరి గ్రామ శివారు సర్వే నం.83లో అక్రమంగా సాగవుతున్న గంజాయి క్షేత్రాలపై తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఎన్కమూరి శివారులో వ్యవసాయ భూములు ఉన్న నాగల్‌గిద్ద మండలం ఎనక్‌పల్లి మోనాతండాకు చెందిన మారుతి, మారోనిబాయిలు కంది పంటలో అంతర పంటగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నారు. ఇరువురు కలిపి దాదాపు అర ఎకరం విస్తీర్ణంలో గంజాయి మొక్కలు పెంచుతున్నారు. ఈ మేరకు ఏపుగా పెరిగిన గంజాయి మొక్కలను కూలీలతో పెకిలించివేశామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో కంగ్టి ఎస్ఐ నానునాయక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

పటాన్‌చెరు: పరిశ్రమలో విద్యుదాఘాతానికి గురైన ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఇది. బీడీఎల్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడ కు చెందిన ఎంఎస్ఎన్ పరిశ్రమలో బీహార్‌కు చెందిన రాయ్ (38) గుత్తేదారుడి వద్ద కార్మికుడుగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం మధ్యాహ్నం పంపుహౌస్‌లో పని చేస్తున్నారు. అక్కడే ఉన్న విద్యుత్తు తీగలు తగిలాయి. ఆస్పత్రికి తరలించే లోపు మృత్యువాత పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు చెప్పారు.

నలుగురు కార్యదర్శులు, సర్పంచిపై కేసు నమోదు

అమీన్‌పూర్: అమీన్‌పూర్ పంచాయతీ పరిధిలో అధికారాన్ని దుర్వినియోగం చేసిన అభియోగాలతో నలుగురు కార్యదర్శులు, సర్పంచిపై బుధవారం అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పంచాయతీ పరిధిలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు కాశీనాథ్, సుమనారాయణ, వాసంతి, ఈఓపీఆర్డీ దేవదాసులు, గ్రామ సర్పంచి కాట శ్రీనివాస్‌గౌడ్ పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని ఎంపీడీఓ అనంతరెడ్డి ఫిర్యాదు చేశారని తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఐదుగురిపై వివిధ ఐపీసీ సెక్షన్‌లలో కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

అత్యవసరంలో.. పట్టణానికి పరుగులు



పటాన్‌చెరులో గర్భిణులకు పూర్తిస్థాయిలో అందని వైద్యం ● ఆస్పత్రికి నెలకు 8 వేల మంది రోగుల రాక

ప్రజావైద్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. క్షేత్రస్థాయిలో మాత్రం దాని ఫలితాలు కనిపించడంలేదు. పటాన్‌చెరులో వంద పడకలతో నిర్మించిన ప్రాంతీయ ఆసుపత్రే దీనికి నిలువెత్తు నిదర్శనం. అయిదు పారిశ్రామికవాడలకు ఆనుకుని, జాతీయ రహదారి పక్కనే ఆస్పత్రి ఉన్నా... కార్మికులు, ప్రజలకు ఆరోగ్య సమస్యల నుంచి విముక్తి లభించడం లేదు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇందుకు కారణం. అత్యవసర చికిత్సా విభాగం, నవజాత శిశు సేవా కేంద్రం, రక్తనిధి కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు ఏర్పాటు చేయకపోవడంతో రోగులు అగచాట్లు పడుతున్నారు. నెలకు ఎనిమిది వేల మందికి పైగా రోగులు వస్తున్నా సేవలు అందని తీరుపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక పరిశీలనాత్మక కథనం...

న్యూస్‌టుడే, పటాన్‌చెరు అర్బన్

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని బీద, మధ్యతరగతి ప్రజల కోసం నియోజకవర్గ కేంద్రంలో రూ. పది కోట్లను ఖర్చు చేసి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించారు. కొద్దోగొప్పో సిబ్బందితో నెట్టుకొచ్చేందుకు.. ఇక్కడ ఏర్పాటు చేస్తారన్న సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం లేదు. దీనితో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సివస్తోంది. గర్భిణుల కోసం హైరిస్కు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తీవ్ర సమస్యలతో వచ్చిన మహిళలకు సేవలు అందిస్తున్నప్పటికీ అప్పుడే పుట్టిన పిల్లలను ఉంచేందుకు నవజాతా శిశు సేవాకేంద్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఏదైనా జరిగితే తమ నెత్తిన పడుతుందని వైద్యులు గర్భిణులను ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నారు. కాన్పుల కోసం గర్భిణులు హైదరాబాద్ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఇదే అదనుగా చేసుకుని కొంతమంది ప్రైవేటు ఆసుపత్రులు యాజమన్యాలు అంబులెన్స్‌లను ప్రభుత్వాసుపత్రి ముందు పెట్టి వారిని నగరానికి తరలిస్తున్నారు. ఉచిత వైద్యం అందుతుందని వస్తున్న గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుండటంతో రూ.30 వేలకు పైగా ఖర్చు అవుతుంది. బీద, మధ్యతరగతి ప్రజలు డబ్బులుకోసం అప్పులుచేసి నానా అగచాట్లు పడుతున్నారు.



పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రి ముందు ప్రైవేటు ఆసుపత్రి అంబులెన్సు

ప్రసవాలు సంఖ్య ఇలా..	
ఏప్రిల్	95
మే	90
జూన్	85
జులై	112

కొలిక్కిరాని అత్యవసర విభాగం

పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రిలో గతంలో అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న మంత్రులు లక్ష్మారెడ్డి, హరీశ్‌రావుల ముందు ఆసుపత్రికి కావాల్సిన సౌకర్యాల కోసం అసుపత్రి సిబ్బంది ఏకరువు పెట్టారు. ఈ సమస్యలో ప్రధానంగా అత్యవసర చికిత్సావిభాగం ఒకటి. అప్పట్లో ఈ విభాగాన్ని 5 పడకలతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఏర్పాటు కాలేదు. అయిదు పారిశ్రామికవాడల్లో ఉన్న వందలాది పరిశ్రమల్లో రియాక్టర్లు పేలడం, అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడం వంటి ఏదో ఘటనలు తరుచూ జరుగుతూనే ఉంటాయి. దీనితో అక్కడ పనిచేసే కార్మికులు తీవ్రంగా గాయపడి ఉండటం, ఇక్కడ అత్యవసర విభాగం లేకపోవడంతో గాంధీ ఆసుపత్రికో, లేక ప్రైవేటు ఆసుపత్రిలో తరలించాల్సి వస్తుంది. జాతీయరహదారి పక్కన ఉండటంతో రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుతూనే ఉంటాయి. అత్యవసరంగా ఉన్న వారిని అత్యవసర చికిత్సా విభాగంలో పెట్టేందుకు ఇక్కడ ఏర్పాటు చేయకపోవడంతో గాంధీకి తరలిస్తున్నారు. రక్తనిల్వ కేంద్రం ఏర్పాటుచేస్తామని చెప్పినా ఇంతవరకూ అమలు కాలేదు. ఆస్పత్రి పరిసరాల్లో ఆహారశాల భవనం నిర్మించినా ఎప్పుడూ తెరుచుకోదు. ఆసుపత్రికి వచ్చినవారు బయటకు వచ్చి అల్పాహారం, ఆహారం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



నిర్మించినా ప్రారంభం కాని ఆహారశాల

నవజాత శిశుకేంద్రం ఏర్పాటు చేయాలి

–కంకరశ్రీను, అభివృద్ధి కమిటీ సభ్యులు

నవజాత శిశుసేవాకేంద్రం ఏర్పాటు చేసుకునేందుకు భవన వసతి అందుబాటులో ఉంది. అందుకు కావాల్సిన సామగ్రి ఏర్పాటు చేస్తే ఇక్కడే నెలకు 200 వరకు ప్రసవాలు జరిగే ఆస్కారం ఉంది. ఇది లేకపోవడంతో సంగారెడ్డి, గాంధీ, నీలోఫర్ ఆసుపత్రులకు కొందరు వెళుతున్నారు. వారిపై ఆర్థిక భారం పడుతోంది.

ప్రతిపాదనలు పంపించాం

–వసుంధర, ఆసుపత్రి సూపరింటెండెంట్

పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రిలో గతంలో అయిదు పడకల అత్యవసర చికిత్సా సేవావిభాగం వచ్చే అవకాశం ఉందని తెలియడంతో ప్రతిపాదనలు చేయాలంటూ గత సూపరింటెండెంట్ ఉండగా చెప్పారు. వెంటనే ప్రతిపాదనలు పంపించాం. అలాగే నవజాత శిశుసేవాకేంద్రం కోసమూ ప్రతిపాదనలు చేశాం. ఇక రక్తనిల్వ కేంద్రం ఏర్పాటుకు నిబంధనలు పంపారు. దానికి కావాల్సిన డీడీ చెల్లించి త్వరలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

పరిశోధనే విద్యార్థులకు ప్రాణవాయువు

పటాన్‌చెరు: నిత్య పరిశోధన విద్యార్థులకు ప్రాణ వాయువులాంటిదని బెంగళూరుకు చెందిన 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్' అధ్యాపకులు వెంకట్రామ్ అన్నారు. ఈ మేరకు బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం గీతం విశ్వవిద్యాలయంలో 'పరిశోధన పద్ధతులు' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న పరిజ్ఞానంపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని అన్నారు. మనముందున్న సమస్యను అర్థం చేసుకొని లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. అప్పుడే విషయంపై స్పష్టత వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఉపకులపతి శివప్రసాద్, డీన్ లక్ష్మణ్ కుమార్, మంజునాథచారి, సంజయ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్రామ్



హాజరైన అధ్యాపకులు

మిషన్ భగీరథ పథకం పనులు వేగవంతం చేయండి

పాలనాధికారి మాణిక్కరాజ్



మాట్లాడుతున్న పాలనాధికారి మాణిక్కరాజ్

సంగారెడ్డి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మిషన్ భగీరథ పథకం పనులు వేగ వంతం చేయాలని జిల్లా పాలనాధికారి మాణిక్కరాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక పాలనాధికారి క్యాంపు కార్యాలయంలో.. మిషన్ భగీరథ పథకం పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ నల్లా నీటిని సరఫరా విషయంలో తాత్సారం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. ఎన్ని పనులు మంజూరు అయ్యాయి? ఆ పనుల్లో పురోగతిలో ఉన్నాయి? అంటూ ఆయన ఆరా తీశారు. నెలవారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని.. ఆ దిశగా పనులు చేపట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ జిల్లా అధికారి రఘువీర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ జిల్లా అధికారి చంద్రమౌళి, ఇంజినీర్లు, గుత్తేదారులు పాల్గొన్నారు.

ఒప్పంద వైద్యాధికారులకు దరఖాస్తుల స్వీకరణ

సంగారెడ్డి అర్బన్: ఒప్పంద పద్ధతిపై వైద్యాధికారుల పోస్టుల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరణ చేస్తున్నట్టు జిల్లావైద్యాధికారి మోజీరాం రాథోడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణఖేడ్ లోని ... స్త్రీ వైద్య నిపుణురాలు, మత్తు (అనస్తీషియా) వైద్య నిపుణుల కోసం ఆగస్టు 21లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చెరువు శిఖంలో పైప్‌లైన్

వెల్దుర్తి: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్ సురక్షితం కాని చెరువు శిఖంలో వేయడం గమనార్హం. వెల్దుర్తి కుడి చెరువు శిఖంలో ఇలా కనిపిస్తుంది. తూప్రాన్ మార్గంలో వెల్దుర్తి పరిధి శేరిల గ్రామానికి మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ వేయాల్సి ఉంది. అయితే సంబంధిత అధికారులు, గుత్తేదారు నిర్లక్ష్యంగా చెరువు కట్టను తవ్వి శిఖంలో నుంచి పైప్‌లైన్ వేశారు. ఇలా వేయడం వల్ల పైప్‌లైన్‌కు మరమ్మతులు అవసరమైనప్పుడు నిండుగా ఉండే చెరువు శిఖంలో మరమ్మతులు చేయడం కష్టమే. దీనికితోడు ఏమైనా లీకులు ఏర్పడితే శుద్ధినీరు కలుషితం అయ్యే అవకాశం లేకపోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా పనులు చేపట్టడంపై ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' గ్రామీణ తాగునీటి సరఫరా ఏఈ అరవింద్ దృష్టికి తీసుకెళ్లగా మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ ఏర్పాటు పనులు తమ పరిధిలోకి రావని, వాటర్‌గ్రిడ్ పరిధిలోకి వస్తాయని చెప్పారు. ఈ విషయాన్ని గ్రిడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



వెల్దుర్తి కుడి చెరువు శిఖంలో పైప్‌లైన్

పటాన్‌చెరు

వివాహ కార్యక్రమంలో ఎమ్మెల్యే

గుమ్మడిదల: గుమ్మడిదలలో వివాహానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. బుధవారం గ్రామ నాయకుడు శంకరాచారి కూతురు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సర్పంచి సురేందర్‌రెడ్డి, ఉపసర్పంచి నరేందర్‌రెడ్డి, మండల తెరాస అధ్యక్షుడు కుమార్‌గౌడ్, సీనియర్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

పటాన్‌చెరు అర్బన్: దోసకాయ రూ.40, దొండకాయ 30, బంగాళదుంప 20, చామదుంప 40, టమాట 50, బెంగళూరువంకాయ 20, వంకాయ 40, తెల్లవంకాయ 40, క్యాబేజి(ఒకటి)25, క్యాలిఫ్లవర్(ఒకటి) 30, గోకరకాయ 40, క్యాప్సికం 50, పచ్చిమిర్చి 60, బెండకాయ 40, కాకరకాయ 40, చిక్కుడుకాయ 40, బీరకాయ 40, కీర 30, క్యారెట్ 60.

హలో ఈనాడు



సమస్యలను తెలియజేయాల్సిన ఫోన్ నంబర్లు

పటాన్‌చెరు	: 8008573228
పటాన్‌చెరు అర్బన్	: 8008573229
రామచంద్రాపురం	: 7093981590
జిన్నారం	: 8008573231
గుమ్మడిదల	: 8008573232

న్యూస్‌టుడే, పటాన్‌చెరు అర్బన్:

సమస్య : పటాన్‌చెరు శ్రీనగర్‌కాలనీలో కొత్తగా అమర్చిన విద్యుత్తు దీపాలు వెలగడంలేదు. –హరినారాయణ గౌడ్, శ్రీనగర్‌కాలనీ

● **సమాధానం :** విద్యుత్తుదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –నాగులు, విద్యుత్తు సరఫరా పర్యవేక్షకుడు

సమస్య : పటాన్‌చెరు అంబేద్కర్ కాలనీలో కుక్కలబెడద అధికంగా ఉంది. –కుమార్, అంబేడ్కర్‌కాలనీ

● **సమాధానం :** కుక్కలబెడద నివారించేలా చర్యలు తీసుకుంటాం. –రంజిత్, పశ్చిమ వెటర్నరీ అధికారి

సమస్య : పటాన్‌చెరు టోల్ గేట్ సమీపంలో నీరుచేరి ఇబ్బందిగా ఉంది. –రాము, పటాన్‌చెరు

● **సమాధానం :** నీటిని తొలిగించేలా చర్యలు తీసుకుంటాం. –సైదుల్‌రెడ్డి, పారిశుద్ధ్యపర్యవేక్షకుడు

ఎంఎంటీఎస్ సమయాలు:



పటాన్‌చెరు అర్బన్ :**(ఆదివారం రోజు వేళల్లో మార్పులు తప్పనిసరి)**

లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా:4.25, 05.55, 6.30, 7.05, 7.45, 8.23, 9.00, 9.25, 10.05, 10.45, 11.30, 12.00, 12.40, 13.10, 13.20, 14.30, 14.50, 15.45, 16.08, 16.25, 17.05, 17.35, 18.10, 18.35, 19.15, 19.38, 20.20, 20.45, 21.10, 21.45, 22.25 **(చివరిది సికింద్రాబాద్ వరకూ మాత్రమే)**

లింగంపల్లి నుంచి హైదరాబాద్ : 5.25, 5.50, 6.38, 7.20, 8.00, 8.43, 9.19, 9.55, 10.29, 11.05, 11.48, 12.30, 13.05, 15.00, 16.13, 17.15, 18.09, 18.40, 19.01, 19.55, 21.00, 21.55, 22.45

నీరు వృథా... బిల్లుల మోత!

● గ్రామ పంచాయతీల్లో నిర్లక్ష్యం

● తడిసి మోపెడవుతున్న కరెంటు ఛార్జీలు

న్యూస్‌టుడే, జిన్నారం :

ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలి, వృథా చేయవద్దు అంటూ.. వేదికలపై ఉపన్యాసాలు చేసే నేతలను, అధికారులను ఊరూరా చూస్తాం. కానీ జిన్నారం మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ పరిధి బోర్ల ద్వారా వచ్చే నీరు వృథా అవుతోంది. ఫలితంగా దీని కోసం వినియోగించే మోటార్ల బిల్లు గుదిబండగా మారుతోంది. ఇది కేవలం నాయకులు, అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవటమేనని స్థానికులు అంటున్నారు. పంచాయతీలలో నెలకొన్న తీరుపై న్యూస్‌టుడే కథనం...



కిష్టాయపల్లిలో వృథాగా పోతున్న నీరు

ఇదిగో ఇలా..

జిన్నారం మండలం కిష్టాయపల్లిలో పలు ప్రాంతాల్లో నల్లాల ద్వారా వచ్చే నీరు 24 గంటలు పోస్తూనే ఉంటాయి. అవసరానికి వాడుకొని తరువాత మోటార్లు నిలుపుదల చేయాలనే ఆలోచనే పంచాయతీ అధికారులకు రావటం లేదు. దీంతో అక్కడ నీరు కళ్ల ముందే వృథా అవుతుండగా.. విద్యుత్తు వినియోగం కూడా పెరిగిపోయి బిల్లులు అధికంగా వస్తున్నాయి. ఇదే పంచాయతీ పరిధిలోని గడ్డపోతారం, చెట్లపోతారం, అల్లీనగర్‌లో కూడా వీధి దీపాలు 24 గంటలు వెలుగుతూనే ఉంటాయి. దీంతో నెల వారీగా రూ.వేలల్లో బిల్లులు చెల్లించాల్సి వస్తుంది. జిన్నారం మండలం కొడకంచి పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. సమస్యను గుర్తించాలని విజ్ఞాపనలు వెళ్లినా పట్టించుకునే వారు లేరు. పంచాయతీ బోర్లు 24 గంటలు నడవటం వల్ల ట్యాంకులు బోర్లిపోతున్నాయి. చాలా వరకు పాఠశాల ఆవరణలోనే ట్యాంకులు ఉన్నాయి, కాబట్టి ఆవరణ బురదమయంగా అవుతుంది. ఇక్కడ నీటి వృథాతో పాటు విద్యుత్తు భారం పెరిగిపోతుందని గ్రామస్థులు అంటున్నారు. ఇలానే చాలా గ్రామాల్లో నెలకొంది. ప్రధానంగా వీధి దీపాలు, నీటి మోటార్లను వినియోగించుకునే విషయంలో సమన్వయ లోపం కనిపిస్తుంది. ఈ విషయంలో పాలకవర్గాలు చూసీ చూడనట్లు వ్యవహరించటం వల్ల విలువైన నీరు వృథా కాగా పంచాయతీలకు నెల వారీగా వచ్చే విద్యుత్తు బిల్లులు భారంగా మారుతుంది. గత ఏడాది మండలంలోని చాలా పంచాయతీలకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి రాగా, 14వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధులను వినియోగించుకోవాలని మండల, జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చారు. కొన్ని పంచాయతీలలో పాలక వర్గాలు చెబుతున్నా.. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. దీనికి తోడు ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి లేకపోవటం కూడా సమస్యగా మారింది. ఏళ్ల కొద్ది పని చేస్తున్న సిబ్బంది ఎవరి మాట వినటం లేదని అంటున్నారు.



కొడకంచిలో నీటి వృథా

ఆదేశాలు ఇస్తాం... : *మల్లారెడ్డి, మండల ఈవోపీఆర్‌డీ*

నీటి వృథాతో పాటు పంచాయతీలలో విద్యుత్తు వాడకం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటాం. మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులకు పలు సూచనలు చేస్తాం. సమస్యను పరిష్కరిస్తాం.

రైతులంటే ఇంత నిర్లక్ష్యమా..?

గుమ్మడిదల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులపై ఎంత గౌరవం ఉందో తెలిసి పోయిందని గుమ్మడిదల మండల తెదేపా అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం గుమ్మడిదలలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం రోజున రైతులను గౌరవించుకోవాలన్న ఆలోచన రెండు ప్రభుత్వాలకు లేకపోవడం బాధకరమన్నారు. రైతులు ఓట్లప్పుడే గుర్తుకు వస్తారని, మిగతా సమయంలో రైతులను విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఉత్తమ రైతులను సన్మానించాలన్న ఆలోచన లేకపోవడంపై విమర్శించారు.

పెళ్లి ఆభరణాల వితరణ

దోమడుగు, గుమ్మడిదల, న్యూస్‌టుడే : రాష్ట్ర భాజపా కౌన్సిల్ సభ్యుడు గిద్దెరాజు పెళ్లి ఆభరణాలను వితరణ చేశారు. బుధవారం దోమడుగు గ్రామానికి చెందిన కటికె జనార్దన్ కూతురు వివాహానికి ఆభరణాలను అందజేశారు. ఆయన వెంట శివరాజ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అన్నారం, గుమ్మడిదల: పేదింటి వధువులకు సీజీఆర్ ట్రస్టు ద్వారా సాయాన్ని స్థాపకుడు గోవర్ధన్‌రెడ్డి అందజేశారు. బుధవారం అన్నారం గ్రామానికి చెందిన వీరేశ్ కూతురు, దోమడుగు గ్రామానికి చెందిన జనార్దన్ కూతురు వివాహానికి రూ.5వేల చొప్పున సాయం చేశారు.

రసాయన పరిశ్రమ నుంచి కాలుష్య జలాల విడుదల





పరిశ్రమ నుంచి విడుదలైన ప్రమాదకర కాలుష్య జలాలు, గడ్డపోతారం పారిశ్రామికవాడలోని ఓ రసాయన పరిశ్రమ నుంచి కాలుష్య జలాలు

జిన్నారం: గడ్డపోతారం పారిశ్రామికవాడలోని ఓ రసాయన పరిశ్రమ నుంచి కాలుష్య జలాలు యథేచ్ఛగా విడుదల అవుతున్నాయి. పరిశ్రమ పైప్ ద్వారా నేరుగా బయటకు వదిలారా? లేక బయటకు వచ్చాయా? అనేది తేలాల్సి ఉంది. బుధవారం గుర్తించిన స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవలే సంబంధిత పరిశ్రమ పీసీబీకి సమర్పించిన బ్యాంకు గ్యారెంటీని జప్తు చేసింది. అయినా తీరు మారకపోవటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ తీరుతో వెనుక భాగం పూర్తిగా కాలుష్య జలాలతో నిండిపోయింది. వర్షం పడితే కాలుష్య జలాలు నేరుగా జిల్లెల వాగు ద్వారా ఖాజీచెరువులోకి తరువాత గండిచెరువులోకి చేరుతాయని స్థానికులు చెప్పారు. అధికారులు తక్షణం సమస్యను గుర్తించాలని కోరుతున్నారు.

అవగాహన ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛత వారోత్సవాల సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీకళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో అవగాహన పెరిగి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొంటారని, మరుగుదొడ్ల నిర్వహణపై సమాచారాన్ని అందించి చైతన్య పరిచేందుకు ర్యాలీ నిర్వహించినట్లు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేవైఎం పట్టణకమిటీ నియామకం

రామచంద్రాపురం రూరల్: బీజేవైఎం పట్టణ కమిటీని నియమించారు. ఈ మేరకు బుధవారం రామచంద్రాపురం భాజపా కార్యాలయంలో మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదావరి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బైండ్లకుమార్‌ల ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రమేశ్, రాకేశ్, ప్రధాన కార్యదర్శులు గాంధీ, శంకర్, కార్యదర్శి శశిధర్, కోశాధికారి ఆకాశ్‌లను నియమించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

జిన్నారం: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిన్నారం, గుమ్మడిదల మండలాలకు మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లకు ఈనెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో సుధీర్ సూచించారు. దరఖాస్తు నకల్లను మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని కోరారు. దరఖాస్తుతో పాటు ఆదాయ, కుల, నివాస, ఆధార్ కార్డులతో సమర్పించాలని సూచించారు. అలాగే అన్ని గ్రామాల్లో ఈ విషయమై దండోరా చేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రాపురం రూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం అయ్యారని రామచంద్రాపురం భెల్ డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సత్యం అన్నారు. ఈ మేరకు బుధవారం డిపో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెరుగుతున్న పనిభారానికి తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించడం లేదని వివరించారు. గతంలో అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకోవడం లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్‌రాజు, ఎండీ నిసార్, అంబాదాస్, నాగయ్య, డీఎన్‌రావు, చందు, రాజేష్ పాల్గొన్నారు.

పటాన్‌చెరు

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పటాన్‌చెరు 132/33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తు నిర్వహణ మరమ్మతులు దృష్ట్యా సరఫరా ఈనెల 17న 3 గంటల పాటు నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు ఏఈ అశోక్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ కరెంటు ఉండదని తెలిపారు.

పైపులైను కొత్తది... ఇబ్బందులు పాతవే!

- పూడ్చని గుంతలు
- పట్టణవాసులకు తప్పని తిప్పలు



పటాన్‌చెరు పట్టణంలో పైపులైను నిర్మాణం కోసం తవ్విన గుంత

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: తాగునీటిని అందించేందుకు కొత్తగా నిర్మించిన పైపులైన్ల పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపైపులైన్ల ద్వారా సరఫరా లేకపోగా.. కాలనీల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఇంటి మందే గుంతలు ఉండటంతో వాహనదారులకు, చిన్నపిల్లలకు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల్లో ఎక్కడా చలనం కన్పించడం లేదని ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పటాన్‌చెరు సర్కిల్‌లో తాగునీటి ఇబ్బందులను తీర్చి కొత్త పైపులైను నిర్మించేందుకు అధికారులు సర్కిల్ అంతా పైపులైను పనులు నిర్వహించారు. దాదాపు ఇది జరిగి ఆరు నెలలు కావొస్తున్నా ఇంత వరకూ పూర్తిస్థాయిలో పనులు పూర్తికాలేదు. ఆలస్యంగా పైపులైను పనులు ప్రారంభంతో ఈ లోపు వర్షాకాలం వచ్చింది. ప్రభుత్వం వర్షాకాలంలో గుంతలు తవ్వే పనులు ఏమీ చేయవద్దని సూచించడంతో అయినకాడికి నిర్వహించారు. ఎక్కడి గుంతలు అక్కడే వదిలేసారు. దీనితో ఇబ్బంది వచ్చింది. శాంతినగర్‌కాలనీలో ఓ ఇంటి మందు తవ్విన గుంతను పూడ్చక పోవడంతో ఇద్దరు పిల్లలు అందులోపడి మోకాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. సర్కిల్‌లో చాలాచోట్ల ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని కాలనీ ప్రజలు చెబుతున్నారు. కొత్తగా పైపులు వేస్తే సురక్షిత నీరు లభిస్తుందని ఆశపడిన పట్టణ వాసులకు ఆశలు తీరడంలేదు. మరో రెండు నెలల వరకూ కొత్తలైన్ల ద్వారా నీరు సరఫరా చేసే యోచన అధికారులకు లేకపోవడంతో ఇంకెన్నాళ్లు అని ఎదురు చూస్తున్నారు. అయితే కొత్త పైపులైను తవ్వకాలతో పాత పైపులైన్లు చాలా చోట్ల ధ్వంసం అయ్యాయని దీనితో మురుగు నీరు వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. నీరు సరఫరా అయ్యే పది నిమిషాల వరకూ నీళ్లు అలానే వస్తున్నాయని చెబుతున్నారు. తాగునీరు రెండు బిందెలు దొరకడం కష్టంగా మారిందని చెబుతున్నారు.



పట్టణ పరిధిలో గుంతలను పూడ్చుతున్న పనివారు

త్వరలోనే పనులు పూర్తిచేయిస్తాం

– హనుమంతు, ఏఈ

పైపులైన్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. పూర్తయినచోట గుంతలు కాంక్రీట్‌తో పూడ్చేస్తున్నాం. పట్టణ పరిధిలో ఇంకా మరికొన్ని చోట్ల గుంతలు ఉన్నమాట వాస్తవమే. పైపులైను కోసం తవ్విన గుంతలు అన్నింటినీ త్వరలోనే పూడ్చి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

మాదవరం, జిన్నారం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రైవేటుకు ధీటుగా నిలవాలని మాధవరం సర్పంచి సురేందర్‌గౌడ్ అన్నారు. మమత ట్రస్టు ఆధ్వర్యంలో రాత పుస్తకాలను 290 మంది విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల దాతల సాయం పెరిగిందని ఇందుకు అనుగుణంగా విద్యార్థులు కష్టపడి చదివాలని అన్నారు. గ్రామానికి, పాఠశాలకు, గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నరేశ్‌కుమార్, భానుమతి, విజయ్ కుమార్‌గౌడ్, భాస్కర్, సతీష్, మల్లేశ్, అనీల్‌గౌడ్ పాల్గొన్నారు.

మండల స్థాయి పాఠశాల క్రీడోత్సవాలు

గుమ్మడిదల: రెండు రోజుల పాటు మండల స్థాయిలో పాఠశాల క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారి కాంతం, కానుకుంట పీఈటీ సారికలు తెలిపారు. ఈ నెల 18, 19న కానుకుంట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 14, 17 ఏళ్ల లోపు బాల బాలికలకు క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18వ తేదీన బాలికలకు, 19న బాలురకు పోటీలు ఉంటాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలలో పోటీలు నిర్వహించనున్నామని, మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని వివరించారు. ఈ క్రీడలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడానికి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

మండల స్థాయిలో క్రీడాకారుల ఎంపికలు

జిన్నారం: ఈ నెల 18, 19 తేదీల్లో జిన్నారం గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని మండల విద్యాధికారి ప్రకాశ్ తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను బాలురకు, బాలికలకు నిర్వహిస్తామని తెలిపారు. అండర్ 14 విభాగానికి వచ్చే వారు 1.1.2004 తరువాత, అండర్ 17 విభాగానికి వచ్చే విద్యార్థులు 1.1.2001 తరువాత జన్మించినట్లు ధ్రువ పత్రాలు కల్గి ఉండాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలకు చెందిన విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

విద్యార్థులకు సత్కారం

జిన్నారం, న్యూస్‌టుడే: గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో పాఠశాలల వారీగా టాపర్లుగా నిలిచిన వారికి మండల యువజన సంఘాల సమితి జ్ఞాపికలు ఇచ్చి సత్కరించింది. ఏడు పాఠశాలలకు చెందిన 16 మంది విద్యార్థులను సత్కరించారు. మొదటి, రెండో స్థానంలో నిలిచిన వారికి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఎంఈవో ప్రకాశ్‌ను సత్కరించారు. జిన్నారం జడ్పీ పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి యాదగిరి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచి సంజీవ, యువజన నేతలు అశోక్‌చారి, వీరేశ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

గొల్ల కురుమల అభివృద్ధికి నిధులు

కానుకుంట, గుమ్మడిదల: రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిందని తెరాస సీనియర్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, మండల తెరాస అధ్యక్షుడు కుమార్‌గౌడ్‌లు పేర్కొన్నారు. బుధవారం కానుకుంట గొల్ల కురుమ మంజూరైన గొర్రెలను సర్పంచి రేణుకతో కలిసి పంపిణీ చేశారు. గ్రామానికి 104 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వి నియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల తెరాస యువత అధ్యక్షుడు అంజిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశంగౌడ్, గుమ్మడిదల సర్పంచి సురేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ ధర్మకర్త సందీప్‌గౌడ్, నాయకులు కుమ్మరి వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, పద్మరెడ్డి, కృష్ణ, బాలకృష్ణరెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసేవకు గుర్తింపు ఉంటుంది

గుమ్మడిదల: ప్రజలకు అంకిత భావంతో సేవలు చేస్తే.. గుర్తింపు లభిస్తుందని గుమ్మడిదల సర్పంచి ఇందెల సురేందర్‌రెడ్డి, సీజీఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు గోవర్ధన్‌రెడ్డిలు అన్నారు. బుధవారం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం అందుకున్న తహసీల్దార్ గోపాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి నరేందర్‌రెడ్డి, మండల తెరాస అధ్యక్షుడు కుమార్‌గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రెడ్డి సంఘం జిల్లా బాధ్యుడు బాలకృష్ణారెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తమవంతుగా కృషి

నల్లవల్లి, గుమ్మడిదల: విద్యాభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని పులిగిల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రకాశంచారి తెలిపారు. బుధవారం నల్లవల్లిలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు ఫర్నిచర్, నోటు పుస్తకాలు, కార్యాలయాలకు సంబంధించిన సామగ్రిని అంద జేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, తెరాస సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచులు కొమరయ్య, నరేందర్‌రెడ్డి, ప్రశాంత్, నాయకులు రామప్ప, రవి, మధు, షరీఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుబెల్లా టీకాకు సర్వం సిద్ధం

ఐడీఏ బొల్లారం, జిన్నారం: మిజిల్స్, రుబెల్లా టీకాను వేయటానికి ఐడీఏ బొల్లారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీహెచ్‌ఈవో చంద్రశేఖర్ అన్నారు. గురువారం నుంచి వచ్చే నెల 21 వరకు నిర్వహించనున్న రుబెల్లా టీకాను సద్వినియోగం చేసుకోవాలని ఈ మేరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలల్లో టీకాను వేస్తామని తెలిపారు. 10,804 మందికి టీకా వేయాలని గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు పరమేశ్, శ్యామల, జ్యోతి పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన మండల విద్యాధికారి

పెద్దాపూర్, (సదాశివపేట) న్యూస్‌టుడే: మండల విద్యాధికారి అంజయ్య బుధవారం మండలంలోని పెద్దాపూర్, ముబారక్‌పూర్ (బీ) ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకునేందుకు వారితో పాఠాలు చదివించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, వీరేశం, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట: జిల్లా స్థాయి ఉత్తమ మండల విద్యాధికారిగా ఎంపికైన అంజయ్యను బుధవారం పీఆర్‌టీయూ మండల శాఖ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంఈవో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రోత్సహిస్తున్న తీరు బాగుందన్నారు. సంఘం నాయకులు రామకృష్ణ, జయరామ రావు, మల్లేశం, రమేశ్, వీరన్న, ఓంప్రకాశ్, తుకారామ్, సురేందర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధికి ఇబ్బందులు కల్గించొద్దు'



నరికేసిన తాటిచెట్లు

సంగారెడ్డి రూరల్, కంది: కంది మండలం చిద్రుప్ప శివారులో 15 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఉన్న ఈత, తాటిచెట్లు తొలగిస్తూ ఉపాధికి ఇబ్బందులు కల్గిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచి నర్సింహాగౌడ్, జై గౌడ ఉద్యమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గ్రామ శివారులో 545 తాటి, 375 ఈత చెట్లు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికులకు కేటాయించారన్నారు. వీటిని తొలగించటం వల్ల తాము ఉపాధి కోల్పోవాల్సి వస్తోందని తెలిపారు. 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కల్లుగీత కార్మిక సంఘానికే కేటాయించాలని కోరారు.

పగిలిన పైప్‌లైన్... గ్రామాలకు నిలిచిన నీరు


గూడూరు మంచి నీటి పథకం


లీకేజీ వద్ద జేసీబీతో మరమ్మతులు


వృధాగా నల్లా

మనూరు, న్యూస్‌టుడే: నాగల్‌గిద్ద మండల పరిధి గూడూరు మంచినీటి పథకం నుంచి సరఫరా అవుతున్న మంజీర తాగు నీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో మూడు రోజులుగా 74 గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. గూడూరు నుంచి నాగల్‌గిద్ద, కంగ్టి మండలంలోని 74 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం నాగల్‌గిద్ద మండల పరిధి కరస్‌గుత్తి శివారులో పైప్‌లైన్ పగిలిపోయింది. నీరంతా వృధాగా పోవడంతో పంపింగ్‌ను నిలిపివేశారు. బుధవారం మరమ్మతులు ప్రారంభించారు. లీకేజీ వద్ద జేసీబీతో తవ్వడం ప్రారంభించారు. మూడు రోజులుగా తాగు నీరు లేకపోవడంతో గ్రామంలోని కలుషితమైన నీరు తాగి అవస్థలు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పైప్‌లైన్ పగిలిన వెంటనే అధికారులు మరమ్మతులు చేయించలేదు. దీంతో తాగు నీటి ఎద్దడి నెలకొంది. చేస్తున్న పనులు నాణ్యతగా చేయకపోవడంతో గూడూరు పథకానికి తరుచూ లీకేజీలు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు నాణ్యతగా చేయించి, ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పచ్చదనం.. ఆలయానికి అందం


నర్సాపూర్‌లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం

న్యూస్‌టుడే, నర్సాపూర్

ఆ ఆలయాన్ని చూస్తూ.. అక్కడి పచ్చదనం పరవశింపజేస్తుంది.. ఆవరణలోకి అడుగుపెడితే ఆహ్లాదకర వాతావరణం స్వాగతం పలుకుతుంది.. పచ్చని తివాచీ పరిచినట్లుండే ఈ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది. పూలు, ఔషధ మొక్కలతో పాటు భక్తులు ప్రదక్షిణలు చేసేందుకు ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అదెక్కడో కాదు.. నర్సాపూర్‌లో కాకతీయుల కాలంలో నిర్మించిన లక్ష్మీనారాయణస్వామి ఆలయం.

అప్పట్లో దేశ్‌ముఖ్‌లు నిర్మించిన ఈ ఆలయం శిథిలం కాగా స్థానికంగా ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.30 లక్షలు వెచ్చించి పునర్‌నిర్మించింది. ఆలయాన్ని నిర్మించి చేతులు దులుపేసుకోకుండా నిర్వహణను సైతం చూస్తోంది. ఇక పచ్చదన సంరక్షణకు ఓ వ్యక్తిని ప్రత్యేకంగా నియమించడం గమనార్హం. నాటిన మొక్కలు పెరిగి పచ్చదనం వెల్లివిరుస్తోంది. ఏపుగా పెరిగిన వృక్షాలు రక్షణ గోడగా నిలిచాయి. ఇక్కడి చెట్లకు పూసిన పూలను స్వామికే సమర్పిస్తుండటం గమనార్హం. ఎక్కడా మట్టినేల అనేది కనిపించకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులు కాలినడకన ప్రదక్షిణలు చేయడానికి బండలు ఏర్పాటుచేసి వాటి చుట్టూ గడ్డిని ఏర్పాటు చేశారు.


ఆవరణలో..


వ్యర్థాలు వేయడానికి ఏర్పాట్లు..

సెప్టెంబరు 3 నుంచి జగదాంబ భవానీ వ్రత దీక్షలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: సెప్టెంబరు 3 నుంచి 23వ తేదీ వరకు శ్రీ జగదాంబ భవానీ వ్రత దీక్ష మహోత్సవాలు జిల్లాలోని అన్ని తండాలలో నిర్వహించాలని ఆల్ ఇండియా లంబాడ శక్తిపీఠ్ సహాయ కార్యదర్శి విఠల్‌నాయక్ రాథోడ్ తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 3న ఉదయం 8 గంటలకు పుల్కల్ మండలం లక్ష్మిసాగర్ పంచాయతీ పరిధిలోని విఠల్‌నాయక్ తండాలో తాను స్వయంగా దీక్షలో పాల్గొంటానని పేర్కొన్నారు. 21 రోజుల పాటు దీక్ష చేపట్టాలన్నారు.

లోక కల్యాణార్థం సుదర్శన యాగం

వర్గల్: ప్రముఖ పుణ్యక్షేత్రం నాచారంగుట్ట లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయంలో లోకకల్యాణార్థం సుదర్శన యాగం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు కొట్టాల యాదగిరి వెల్లడించారు. బుధవారం క్షేత్రం కార్యాలయంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సమావేశంలో పలు అంశాలు చర్చించామని తెలిపారు. ముఖ్యంగా సుదర్శన యాగంపై చర్చ సాగిందని చెప్పారు. దాతల సహకారంతో నవంబరు 13 నుంచి 16 వరకు యాగాన్ని భారీగా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. క్షేత్రంలో టెంటు సామగ్రికి టెండరు నిర్వహిస్తామన్నారు. క్షేత్రంలోని అతిపురాతన శిథిలమైన సత్రాలను కూల్చివేస్తామని స్పష్టంచేశారు. పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈవో సుధాకర్‌రెడ్డి, ధర్మకర్తలు కృష్ణమాచార్యులు, జహంగీర్‌యాదవ్, రాములుగౌడ్, పడిగె రాజు, చంద్రారెడ్డి, పాండురంగారావు, విఠల్, కె.యాదగిరి, రాజనర్సింగరావు, పద్మావతి పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా... వేగంగా అడుగులు

(మొదటిపేజీ తరువాయి) పహణీలు, ఇతరత్రా రెవెన్యూ దస్త్రాల్లో పొరపాటుగా నమోదైన తప్పులను సరిదిద్దేలా ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తున్నారు. నేరుగా ప్రతి ఇంటికీ వెళ్లి తప్పొప్పులను సరిచేస్తున్నారు. ఈనెల 15 వరకు 300 గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసేలా లక్ష్యం విధించారు. ఆమేరకు అధిగమించారు. ఇప్పటివరకు 304 గ్రామాల రికార్డుల్లో తప్పులను సరిదిద్ది రైతులకు సవరించిన పత్రాలను అందించడం విశేషం. గ్రామంలో ఈ ప్రక్రియ పూర్తికాగానే ఆ ఊర్లో సభ నిర్వహించి ఎన్ని తప్పులను సవరించామనే సమాచారాన్ని రాతపూర్వకంగా గ్రామసభకు అందిస్తున్నారు. వ్యక్తిగతంగానూ ప్రతి రైతుకూ ఏ తప్పు ఇప్పటి వరకు రికార్డుల్లో ఉంది? దానిని ఎలా సరిచేశామనే వివరాలను వారికి వివరిస్తున్నారు. ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు తీరుతుండటంతో భూహక్కుదారుల్లో ఆనందం కనిపిస్తోంది. మరో 68 రెవెన్యూ గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది.



తప్పులను సవరించి జహీరాబాద్ మండలం అనెగుంట గ్రామస్థులకు ప్రొసీడింగ్ అందిస్తున్న రెవెన్యూ అధికారులు

జహీరాబాద్ డివిజన్ ప్రథమం

రెవెన్యూ సమస్యలు లేని గ్రామాలను తీర్చిదిద్దే విషయంలో జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ ప్రథమ స్థానంలో కొనసాగుతోంది. ఈనెల 14వరకు ఉన్న గణాంకాల మేరకు ఇక్కడ 56.06శాతం ప్రక్రియ పూర్తైంది. వివరాలిలా...

డివిజన్	మొత్తం రెవెన్యూ గ్రామాలు	ప్రక్రియ పూర్తైనవి	పూర్తైన శాతం
జహీరాబాద్	173	97	56.06
నారాయణఖేడ్	140	68	48.57
సంగారెడ్డి	287	139	48.43

నేడు జగ్గారెడ్డి ఆమరణ నిరాహార దీక్ష

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డికి వైద్య కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆమరణ నిరాహార దీక్ష చేయనున్నట్లు మాజీ విప్, కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ ప్రతినిధి జగ్గారెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని రామమందిరం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక కలెక్టరేట్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని ఆయన కోరారు. పోలీసు చట్టం 30 అమలులో ఉన్నందున జగ్గారెడ్డి ర్యాలీలకు, ఆమరణ దీక్షలకు పోలీసు శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదని సంగారెడ్డి డీఎస్పీ తిరుపతన్న పేర్కొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

నర్సాపూర్ రూరల్: అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మెదక్ జిల్లా నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఉత్తమ సేవలు అందించినందుకు నర్సాపూర్ ఆర్డీవో వెంకటేశ్వర్లు, పీఆర్ డీఈ వేణుగోపాల్, ఎస్ఐ వెంకటరాజాగౌడ్, తహసీల్ కార్యాలయం జూనియర్ అసిస్టెంటు నాగరాజు, చిప్పల్‌తుర్తి వీఆర్వో ధన్‌సింగ్, ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్‌లు ప్రశంసాపత్రాలు అందుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో వీరందరినీ స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ పరిధిలో ప్రజలకు విలువైన సేవలు అందిస్తూ ప్రశంసలు అందుకోవాలన్నారు. తెరాస జిల్లా నాయకుడు అశోక్‌గౌడ్, డీసీసీబీ వైస్‌ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, తెరాస మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు హబీబ్‌ఖాన్, నాగేష్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సమష్టి కృషి

తూప్రాన్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం దళితులందరు ఏకం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన తూప్రాన్‌లో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడంలో తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేసి రెండు రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా అక్టోబర్ 14వ తేదీన మరోమారు 'చలోఅమరావతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికైనా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించేలా చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మాసాయిపేట యాదగిరి, గజ్జెల భిక్షపతి, రాములు, జిల్లా బాధ్యులు నాగార్జున, నాగులు, పట్టణ అధ్యక్షుడు రమేశ్, నర్సింలు తదితరులున్నారు.

జవ 'జీవాలు'... ఉత్తిమాటేనా!

(మొదటిపేజీ తరువాయి) మరణించాయంటూ అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. జహీరాబాద్ మండలం మల్‌చెల్మలో 11, కొత్తూరులో 03, రురాసం గంలో 02, మనూరు మండలంలో కరస్‌గుత్తిలో 02, మనూరులో 07, నారాయణఖేడ్‌లోని గంగాపూర్‌లో 05, వట్‌పల్లిలో ఒకటి చొప్పున చనిపోయాయి. ఇలా లెక్కన చూసినా వీటి సంఖ్య 31కి చేరుతుంది. అధికారులు 11 మాత్రమేనంటూ స్పష్టం చేస్తున్నారు. అనారోగ్యం బారిన పడిన వాటి సంఖ్య వందల్లోనే ఉంటుంది. ఈవివరాల సేకరణపైనా అధికారులు దృష్టిసారించడం లేదు. అంతా బాగుంది.. సమస్యేం లేదన్నట్లుగా మిన్నకుండిపోతున్నారు. ఇదే విషయాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు రాథోడ్ దృష్టికి తీసుకెళ్లగా... కిందిస్థాయి నుంచి వచ్చిన వివరాల మేరకు పంపిణీ చేసిన అనంతరం 11 మాత్రమే చనిపోయాయన్నారు. అందరినీ అడిగి పూర్తి సమాచారాన్ని తెలుసుకుంటానన్నారు.

ఖాళీల సమస్యతో ఇబ్బంది

జిల్లాలో ఇప్పటి వరకు 2,898 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేశారు. అంటే ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు కొత్తగా 60,858 గొర్రెలు వచ్చాయి. వాటికి వైద్యం అందించేందుకు ఆమేరకు పశువైద్యాధికారులు లేకపోవడంతోనూ ఇబ్బందులు తప్పడం లేదు. బీమా, మందులు తదితరాలకు ముందే డబ్బులు మినహాయించుకున్న అధికారులు వీటికి సరైన వైద్యం అందించడంలో విఫలమవుతున్నారు. వయసు ఎక్కువగా ఉన్న గొర్రెలను ఇవ్వడంతోపాటు వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా గొర్రెలు రోగాల బారిన పడే అవకాశముంది. ఈక్రమంలో మెరుగైన వైద్యం అందిస్తేనే అవి చనిపోకుండా కాపాడటానికి వీలవుతుంది. కానీ జిల్లాలో ఖాళీల కొరత వేధిస్తోంది. 49 మంది పశువైద్యులు ఉండాల్సి ఉండగా 38 మంది మాత్రమే ఉన్నారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో గొర్రెలు చనిపోతున్నాయని చెప్పినా ఆలస్యంగా అధికారులు అక్కడికి చేరుకుంటున్నారు.

గిట్టుబాటైతే బతికేదెట్ల: విష్ణు, కొత్తూరు

మాది జహీరాబాద్ మండలం కొత్తూరు. అధికారులు నాకు 21 గొర్రెలను అందించారు. వాటిలో ఇప్పటికే రెండు చనిపోయాయి. పంపిణీ చేసిన ఎనిమిది రోజుల్లోనే ఇది జరిగింది. మాఊరుకే చెందిన మల్లేశం అనే వ్యక్తికి ఇచ్చిన వాటిలోనూ ఈనెల 15న ఒకటి చనిపోయింది. మాకు ఎంతో ఉపయోగపడాల్సిన పథకం ఇలా నీరుగారి పోతుంటే ఎలా. అధికారులు వెంటనే స్పందించాలి.

గోపాలమిత్రలను వాడుకుంటున్నాం

–రామారావు రాథోడ్, జిల్లా అధికారి, పశుసంవర్ధక శాఖ

జిల్లాలో పశువైద్యులు లేని చోట గోపాలమిత్రల సేవలను వినియోగించుకుంటున్నాం. పది మంది విశ్రాంత పశువైద్యులను నియమించుకోవాలంటూ ఉన్నతాధికారులు సూచించారు. ఇప్పటి వరకు ఆరుగురికి నియమించాం. మిగతా నలుగురి కోసం ప్రయత్నిస్తున్నాం. ఆరోగ్యంగా ఉన్న గొర్రెలనే లబ్ధిదారులకు అందిస్తున్నాం. ఎక్కడైనా అవి రోగాల బారిన పడ్డాయని సమాచారం వస్తే తక్షణం మా సిబ్బంది అక్కడికి వెళ్లి వైద్యం అందిస్తున్నారు. దురదృష్టవశాత్తు ఏమైనా గొర్రెలు చనిపోతే... ప్రభుత్వం బీమా చెల్లిస్తుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

అనారోగ్యమైనవే పంపిణీ చేశారు

–దశరథ్, మనూరు, లబ్ధిదారు

ప్రభుత్వం 21 గొర్రెలను ఇచ్చింది. అందులో ఒకటి నాలుగు రోజుల నుంచి మృత్యువుతో పోరాడుతుంది. చేయాల్సిన చికిత్సలు చేసినా లేవడం లేదు. చనిపోయే ప్రమాదంగా ఉంది. గొర్రెలు నాణ్యతగా పంపిణీ చేయకపోవడంతోనే అవి మృత్యువాత పడుతున్నాయి.



మూడు గొర్రెలు చనిపోయాయి: రాములు, మల్‌చెల్మ, జహీరాబాద్

మా గ్రామంలో మొత్తం 25 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. అవి రోజుకోటి చొప్పున చనిపోతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 11 గొర్రెలు ఇలా మృత్యువాతపడ్డాయి. బతికున్న వాటిలోనూ చాలా వరకు నడవలేకపోతున్నాయి. మేత కూడా సరిగ్గా తినడం లేదు. వైద్యులకు ఇదే విషయం చెబితే వారు వచ్చి మందులు ఇచ్చి వెళుతున్నారు. నాకు ఇచ్చిన వాటిలోనూ మూడు గొర్రెలు చనిపోయాయి. ఇలా జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు రోగాలు లేని మంచి గొర్రెలను ఇస్తే మాకు ప్రయోజనం దక్కుతుంది.



తెచ్చిన వారంలోనే మృతి

–మారుతి, లబ్ధిదారు, మనూరు

కర్నూల్ నుంచి తెస్తున్నప్పుడు గొర్రెల్లో ఒకటి లేవలేని స్థితిలో ఉంది. తెచ్చిన వారం రోజులకే అది ప్రాణం విడిచింది. మరొకటి ప్రస్తుతం మృత్యువుతో పోరాడుతుంది. 21 గొర్రెలను పంపిణీ చేయగా అందులో అయిదు ముసలివి ఉన్నాయి. మరికొన్ని వాతావరణం పడక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నాయి.



నాణ్యమైనవి అందిస్తే బాగు

–మల్లప్ప, కరస్‌గుత్తి

ప్రభుత్వం నాణ్యత గొర్రెలను పంపిణీ చేసి ఉంటే ఇలా వ్యాధులతో బాధపడి చనిపోయేవి కావు. వ్యాధి సోకిన వెంటనే చికిత్సలు అందడం లేదు. అధికారులు ఉచితంగా అందించాల్సిన చికిత్సలు చేయాలి. మిగతా గొర్రెలైనా చనిపోకుండా చూడాలి.



ఉచిత వైద్య శిబిరం రేపు

సిద్దిపేట అర్బన్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గ్లోబల్ ఐ, సన్‌షైన్ హైదరాబాద్ ఆసుపత్రి వారిచే సిద్దిపేటలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో కంటి, గుండె సంబంధిత, ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, కుటుంబసభ్యులు వినియోగించుకోవాలని కోరారు.

'నిరుద్యోగులను మభ్యపెట్టేందుకే ఉద్యోగ ప్రకటనలు'

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: ఉద్యోగాల పేరిట మూడేళ్లుగా ఊరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిరుద్యోగులను మభ్యపెట్టేందుకే మరోసారి ఉద్యోగ ప్రకటనలు చేశారే తప్ప దీంట్లో విశేషమేమీ లేదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. దీంతో ఒరిగేదేమీ లేదని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి మాటలు తియ్యగా ఉంటాయని.. చేతలు చేదుగా ఉంటాయని ఎద్దేవా చేశారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్లలో 27,660 నియామకాలు చేశామని ముఖ్యమంత్రి ప్రకటించారని, ప్రభుత్వం మాత్రం 22,468 పోస్టులను మాత్రమే వెల్లడించిందని, మిగతా 5,129 నియామకాలు ఎక్కడకు పోయాయని ప్రశ్నించారు. 22,468 పోస్టుల్లో 10,449 పోస్టులు పోలీసు శాఖకు సంబంధించినవని, 5515 పోస్టులు సింగరేణి ఉద్యోగాలని, సింగరేణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సంస్థ అని, దీనిని బట్టి ప్రభుత్వం పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలతో పాటు కేవలం 16 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన 84,875 ఖాళీల నియామకాలు భర్తీ చేయకపోవడానికి కారణం ఎవరు? ఎవరు అడ్డుపడ్డారు? ఏ ప్రతిపక్షం అడ్డుపడిందని ప్రశ్నించారు. అవగాహనా రాహిత్యం, అలసత్వం, నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం, అవినీతి టీఎస్‌పీఎస్సీకి పర్యాయపదాలని, టీఎస్‌పీఎస్సీ సభ్యులకు నోటిఫికేషన్లు, నిబంధనలపై కనీస అవగాహన లేదన్నారు. టీఎస్‌పీఎస్సీ వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



నర్సాపూర్‌లో స్వచ్ఛతపై విద్యార్థుల ర్యాలీ

యువ ఇంజినీర్లు..
సేవా పథం

ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో ఆదర్శం

న్యూస్‌టుడే, నర్సాపూర్

జీవితంలో రూ.కోట్ల ధనం సంపాదించినా పొందని ఆనందం ఓ సేవా కార్యక్రమం నిర్వహిస్తే కలుగుతుంది.. సామాజిక సేవతో సంతృప్తి కలుగుతుందంటూ పెద్దలు చెప్పిన మాటను తూచా తప్పకుండా పాటిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఈ యువ ఇంజినీర్లు.. ఎన్‌ఎస్‌ఎస్ స్ఫూర్తిని అందిపుచ్చుకొని పెన్నులు, పుస్తకాలు పక్కనపెట్టి పలుగు, పార చేతబట్టి పల్లెలకు కదిలారు.. కేవలం జాతీయ నినాదాన్ని నాలుగుగోడల మధ్యన పరిమితం చేయకుండా విద్యనభ్యసించడంతో పాటు సామాజిక సమస్యలను పరిష్కరించడంలోనూ తామేమీ తక్కువ కాదని నిరూపిస్తున్నారు.. నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు. ఇదే మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంతో పాటు నర్సాపూర్ పట్టణంలోనూ 15 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి ఆదర్శంగా నిలిచారు.

స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో..

బీవీఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అన్ని విభాగాల విద్యార్థులతో ఎన్‌ఎస్‌ఎస్ విభాగాన్ని ఏర్పాటుచేశారు. ఆసక్తి ఉన్న వారు ముందుకు రాగా వారితో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. చదువుతో పాటు వీటిని చేపట్టడం వల్ల భావి జీవితంలో వేసే అడుగులకు ప్రత్యక్ష అవగాహన కలుగుతుందన్న సదుద్దేశంతో దీనికి పూనుకున్నారు. ప్రస్తుతం 300 మంది విద్యార్థులు సభ్యులుగా కొనసాగుతున్నారు. సమన్వయకర్తలుగా నీరజవర్మ, వరుణ్‌కుమార్, శివరామరాజు, గోపాలకృష్ణ, ఝాన్సీ, లోహిత, సాయికిరణ్, దినేశ్‌లు వ్యవహరిస్తున్నారు. ఐటీ విభాగం అధిపతి దశరథరామయ్య ఆధ్వర్యంలో జేఎన్టీయూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ పి.సమ్మూలాల్ సూచనల మేరకు కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన స్వచ్ఛభారత్ పిలుపును అందిపుచ్చుకొని విద్యార్థులు ఇటీవల స్వచ్ఛభారత్ పక్వాడ కార్యక్రమాన్ని 15 రోజుల పాటు చేపట్టడం విశేషం.

పరిసరాల శుభ్రతపై చైతన్యం.. నర్సాపూర్ మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామాన్ని కళాశాల యాజమాన్యం దత్తత తీసుకుంది. వ్యక్తిగత శౌచాలయాల నిర్మాణాలను చొరవ చూపింది. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో పాటు కళాశాల యాజమాన్యం సైతం నిధులు వెచ్చించి పనులు పూర్తిచేసేలా కృషి చేయడం విశేషం. దీంతో ఈ గ్రామం సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా ఎంపికైంది. జిల్లా పాలనాధికారి చేతుల మీదుగా సర్పంచి లక్ష్మీనారాయణ సైతం పురస్కారం అందుకున్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో భాగంగా సుమారు 300 మంది విద్యార్థులు గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టి చెత్తాచెదారం తొలగించారు. వీధులను శుభ్రం చేశారు. పరిసరాల శుభ్రతపై ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. వ్యక్తిగత శౌచాలయాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, రక్షితనీటి పథకం, చెరువు గట్టు పరిసరాలను సైతం శుభ్రం చేశారు. అలాగే నర్సాపూర్‌లో జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేశారు. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం, స్వామివివేకానంద విగ్రహాలను నీటితో కడిగారు.

శ్రమదానం చేసి.. ఈ యువ ఇంజినీర్లు ఇంతటితో ఆగిపోకుండా నర్సాపూర్‌లో పలుగు, పార, చీపుర్లు చేతపట్టి ఆర్టీసీ ప్రయాణప్రాంగణం, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రయాణ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆసుపత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.




ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో..

విత్తన బంతికి ఆదివారం

- పిల్లలు, యువకుల స్వచ్ఛంద ప్రయత్నం
- ప్రోత్సహిస్తున్న అమ్మ ట్రస్టు
- ప్రతి సెలవు నాడు 200 వరకు తయారు
- జిల్లా నుంచి కేరళకు తరలింపు

ఆదివారం.. సెలవు దినం.. ఇంట్లోవాళ్లు అరిచినా.. పొద్దెక్కే వరకు పిల్లలు నిద్ర లేవరు. చిన్న పిల్లల పరిస్థితి వేరే చెప్పనక్కర లేదు. ఒకవైపు మేల్కొలుపుతుంటే.. మరోవైపు తిరిగి నిద్రిస్తుంటారు. కానీ... ఇక్కడ ఇలాంటి పరిస్థితి ఉండదు. ఎవరూ మేల్కొపాల్సిన పని ఉండదు. అందరికంటే ముందే లేవడానికి ప్రయత్నం చేస్తారు. పనులన్నీ చకచకా ముగించుకుంటారు. ప్రతి ఆదివారం వారికి నిర్దేశించిన పనిలో నిమగ్నమవుతారు. సామాజిక బాధ్యతలో మేము సైతమంటూ కదులుతారు. విత్తన బంతుల తయారీలో నిమగ్నమవుతారు. వారే కోడూరుకు చెందిన యువకులు, పిల్లలు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం....



వారంలో ఒక రోజు..
– దశరథ్, డిగ్రీ విద్యార్థి, కోడూరు



అమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో సెలవు, పండగ రోజుల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా.. లభించిన ముడి పదార్థాల ఆధారంగా విత్తనబంతులు తయారు చేస్తాం. ఆ రోజు ఎట్టి పరిస్థితిలో.. కొన్నైనా తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

ప్రభుత్వం సహకరించాలి
– సంతోష, ఇంటర్ విద్యార్థిని, కోడూరు



గ్రామాలలో పశు సంపద తగ్గింది. ఉన్నవాటిలో అధికంగా గేదెలు ఉన్నాయి. చాలా తక్కువ మంది వద్ద ఆవులు ఉన్నాయి. అందులో కొందరు మూత్రం, పేడ ఇవ్వడానికి అంగీకరించరు. ముందుకు వచ్చిన వారి వద్ద సేకరించి తయారు చేస్తాం. ఇలాంటి సందర్భంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

స్వచ్ఛందంగా పాల్గొంటున్నాం..
– గీత, పదో తరగతి విద్యార్థిని, కోడూరు



గ్రామంలో కొనసాగుతున్న ట్రస్టు సేవలు అందరి కోసం స్వచ్ఛందంగా చేపడుతున్నారు. ఇక్కడ తయారు చేస్తున్న విత్తనబంతులు ఇతర రాష్ట్రానికి తీసుకెళ్తున్నారంటే కారణం.. ఇక్కడ వినియోగించుకోకపోవడమే. ప్రభుత్వం స్పందించి వీటిని అటవీశాఖ వినియోగించుకునేలా చూడాలి. హరిత హారానికి ఇలాంటి వాటిని అనుసంధానిస్తే ప్రయోజనం ఉంటుంది.

న్యూస్‌టుడే, పుల్కల్

కోడూరు గ్రామంలోని యువకులు, వృద్ధులు, పిల్లలు.. స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. మాతా అమృతానందమయి మఠ్ (అమ్మ ట్రస్టు) ఆధ్వర్యంలో కొత్తపుంతలు తొక్కుతున్నారు. సంపాదన, కుటుంబమే కాకుండా.. సామాజిక బాధ్యతగా ప్రయత్నం చేస్తున్నారు. వారంలో ఒక రోజు స్వచ్ఛందంగా కదిలి సమాజసేవకు సమయాన్ని కేటాయిస్తున్నారు. పిల్లల స్వచ్ఛంద కార్యక్రమాలకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా విత్తన బంతులు తయారు చేస్తున్నారు. ప్రతి ఆదివారం స్వచ్ఛభారత్‌లో భాగంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో కొంత సమయాన్ని విత్తన బంతుల తయారీకి వినియోగిస్తున్నారు. ముందుగా సమష్టిగా స్థానిక నాగలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుంటారు. బృందాలుగా విడిపోయి.. తయారీ పనుల్లో నిమగ్నమవుతారు.


యువకులు తయారు చేసిన విత్తనబంతులు

బాధ్యతగా కదులుతారు

అమ్మట్రస్టు ద్వారా గ్రామంలో కొనసాగుతున్న ట్యూషన్ తరగతులకు 80 మంది వివిధ తరగతుల విద్యార్థులు వస్తారు. వీరిలో ప్రాథమిక తరగతుల నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు ఉన్నారు. వీరికి ప్రత్యేకంగా ట్యూటర్లను నియమించారు. అంతేకాక ఇక్కడ ట్యూషన్‌కు వస్తున్న విద్యార్థులకు ఏడాదికి రూ.1500 ఉపకార వేతనాన్ని ట్రస్టుద్వారా అందజేస్తున్నారు. వీరంతా ఆదివారం వచ్చిందంటే ఉదయమే లేస్తారు. కొందరు ఆవు మూత్రం సేకరిస్తారు. ఇంకొందరు పశువుల పేడ తెస్తారు. మిగతా వారు నల్లమట్టిని తెస్తారు. వాటన్నింటినీ ఆలయం వద్దకు తీసుకెళ్లి కలిపి ముద్దగా తయారు చేస్తారు. వాటి సేకరణకు గ్రామంలోని పెద్దలు సహకరిస్తారు. బాలురు, బాలికలు, యువకులు విడిపోయి కలిపిన మిశ్రమంతో చిన్నచిన్న గుండ్రటి బంతులు తయారు చేస్తారు. అంతకు ముందు స్థానికంగా లభించే చింత, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, సపోటా, సొర, బీర, దోస తదితర విత్తనాలు సిద్ధంగా ఉంచుతారు. ఆ విత్తనాలను గుండ్రంగా తయారు చేసిన మట్టి బంతుల్లో విత్తనాలను అమర్చుతారు. గుండ్రంగా.. బంతి ఆకారంలో మట్టి ముద్దలను చేస్తారు.


వినియోగిస్తున్న స్థానంగా తయారు చేసిన విత్తనాలు

సిద్ధం కాగానే..

వారానికి ఒకరోజు లభించిన పేడ, గోమూత్రం ఆధారంగా విత్తనబంతులు తయారు చేస్తారు. పిల్లలు వెళ్లే సరికి ఇంటి యజమాని పశువుల కొట్టాన్ని శుభ్రం చేస్తే.. బంతుల తయారీకి కావాల్సిన ముడి సరకు లభించదు. ఇలాంటి సమయంలో 100 విత్తన బంతుల వరకు మాత్రమే తయారు చేస్తారు. ఒక్కో సమయంలో ముడి సరకు (పేడ, గోమూత్రం, మట్టి) అధికంగా లభిస్తుంది. అలాంటి సమయంలో 200 నుంచి 600 వరకు తయారు చేస్తారు. ఎండలో ఆరబెట్టి ఆలయం పక్కనున్న గదిలో భద్రపరుస్తారు. రెండు నెలలకో సారి ట్రస్టు కార్యక్రమాలు పర్యవేక్షించడానికి కేరళ నుంచి సభ్యులు వస్తారు. వారు తిరిగి వెళ్లే సమయంలో సిద్ధంగా ఉన్న విత్తన బంతులను కేరళకు వెంట తీసుకెళ్తారు. ఇలా ప్రతి ఏడాది ఆరు వేల వరకు విత్తన బంతులు కోడూరు గ్రామం నుంచి కేరళకు వెళ్తున్నాయి. వీటిని స్థానికంగా ఉండే మఠం సభ్యులు అప్పుడప్పుడు పిల్లలతో కలిసి గ్రామ శివార్లలో వేస్తారు. కూరగాయలకు చెందిన విత్తన బంతులను గ్రామస్థులకు ఉచితంగా అందజేస్తారు. వారితో ఇళ్ల ముందు నాటిస్తారు. ఇంత జరుగుతున్నా గ్రామంపై అధికారులు దృష్టి సారించడం లేదు. సొంతంగా ముడి సరకులు సమకూర్చుకొని పిల్లలు వీటిని తయారు చేస్తున్నారు. కావాల్సిన పదార్థాలు సమకూరిస్తే ట్రస్టు ఆధ్వర్యంలో విత్తన బంతులు అధికంగా తయారు చేసి ఉచితంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని గ్రామస్థులు చెబుతున్నారు.

ఇదీ ప్రధాన లక్ష్యం..

తయారు చేసిన విత్తన బంతుల్లో కూరగాయల మొక్కలకు సబంధించినవి స్థానికంగా వినియోగిస్తున్నారు. మొక్కలు చెట్లుగా ఎదిగేందుకు అవకాశమున్న బంతులను కేరళకు తరలించి.. అక్కడ అడవిలో వేస్తారు. మొక్కలు నాటడానికి వీలు లేని ప్రాంతాల్లో విత్తన బంతులు వేస్తే.. వర్షం కురిసినప్పుడు సహజంగా మొలకెత్తుతాయి. పెరిగి పెద్దవవుతాయి. మన రాష్ట్రంలో కూడా హరితహారాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నందున.. ఇలాంటి విత్తన బంతుల తయారీని ప్రోత్సహించి.. అడవుల్లో వేసేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

గ్రామస్థులు సహకరిస్తే.. వారానికి వెయ్యి చేస్తాం..
– సుభాష్ చందర్, మాతా అమృతానందమయి గ్రామ కన్వీనర్

విద్యార్థులు, యువకులు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు.. పేడ, ఆవుమూత్రం, మట్టి సేకరణ ఇబ్బందిగా మారింది. గ్రామస్థులు సహకరించి.. వీటిని ఇవ్వడానికి ముందుకు వస్తే.. వారానికి వెయ్యి విత్తన బంతులు తయారు చేస్తాం. మేం తయారు చేసినవి గ్రామస్థులకు ఉచితంగా ఇస్తాం.. ఇక్కడ మిగిలినవి కేరళకు తరలిస్తున్నాం.


నల్లంపల్లి కూడలి వద్ద ఏర్పాటు చేసిన అంతర్గత ట్యాంకు


మహబ్బత్‌పూర్ శివారులోని ట్యాంకు, ఫిల్టర్‌బెడ్


నీటిపథకం పైలాన్

రూ.37 కోట్లతో పథకం..
53 గ్రామాలకు ప్రయోజనం..!

ప్రారంభానికి సిద్ధమైన మంజీర తాగునీటి పథకం • వారం రోజులుగా ప్రయోగ పరీక్ష

న్యూస్‌టుడే, రాయికోడ్

రూ.37 కోట్లు వ్యయం చేసి నిర్మించిన తాగునీటి పథకం.. రెండు మండలాల్లోని 53 గ్రామాల పరిధిలో లక్ష మంది జనాభా నీటి అవసరాలకు సరిపోయేలా అధికారులు ప్రణాళిక చేశారు. నిత్యం 10 మిలియన్ లీటర్ల పంపింగ్‌తో చేపట్టిన భారీ తాగునీటి పథకం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రాయికోడ్, మునిపల్లి మండలాల్లోని గ్రామీణ ప్రజల తాగునీటి ఇబ్బందులను తీర్చేందుకు ప్రభుత్వం మంజీర శాశ్వత తాగునీటి పథకాన్ని రూపకల్పన చేసింది. ఫిల్టర్‌బెడ్, ఇంటెక్‌వెల్, పైపుమార్గం, ట్యాంకుల నిర్మాణం వంటి పనులు పూర్తయ్యాయి. పథకంలోని లోటుపాట్లను సవరించేందుకు గత వారం రోజులుగా ట్రయల్‌రన్ సైతం కొనసాగుతోంది. ఈ పథకాన్ని 'మిషన్ భగీరథ'లో విలీనం చేసి ఇరు మండలాల్లో తాగునీటి ఇబ్బందులను తీర్చేందుకు సంకల్పించారు. రాయికోడ్ మండలంలోని పాంపాడ్ వద్ద మంజీరనదిపై అంతర్గత బావిని ఏర్పాటుచేసి.. అక్కడి నుంచి మహబ్బత్‌పూర్ గ్రామ శివారులోని ఫిల్టర్‌బెడ్‌కు నీటిని పంపింగ్‌చేస్తారు. ఇక్కడ నీటిని శుద్ధి చేసి గ్రామాలకు సరఫరా చేస్తారు. త్వరలో ప్రారంభోత్సవం చేయనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఏళ్లుగా ఎదురుచూపులు

చెంతనే మంజీర నది ఉన్నా.. తాగునీటి సమస్య మాత్రం రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో తీవ్రంగా ఉండేది. దీంతో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు అప్పటి ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహకు రాయికోడ్, మునిపల్లి మండలాల్లోని తాగునీటి ఇబ్బందులను వివరించారు. ఆయన 2012లో రాయికోడ్ మండలంలోని పాంపాడ్ శివారులో మంజీరనది నుంచి తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని భావించారు. ఇందు కోసం మంజీర శాశ్వత తాగునీటి పథకం కింద రూ.37 కోట్ల నిధులు మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియను పూర్తి చేసి గుత్తేదారుకు పనులను అప్పగించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. పనులు నిర్దేశించిన సమయంలో పూర్తి కాలేదు. నాలుగేళ్లపాటు కొనసాగి.. ఎట్టకేలకు ఇటీవల పూర్తయ్యాయి. ఈ పథకం ద్వారా రాయికోడ్ మండలంలోని (శంషుద్దీన్‌పూర్, హుల్గెర గ్రామాలను మినహాయించి) 33 గ్రామాలకు, మునిపల్లి మండలంలోని 20 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయనున్నారు. రోజుకు ఒక్కరికి సగటున 100 లీటర్ల నీటి చొప్పున 10 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేయనున్నారు. ఈ పథకం ద్వారా సుమారు లక్ష జనాభాకు తాగునీటి సౌకర్యం కలగనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తాహా తెలిపారు.


నల్లంపల్లి కూడలి వద్ద ట్యాంకు


కప్పాడ్ శివారులో..

పథకం ప్రారంభమైతే ప్రయోజనం
– తిరుమల నవీన్, జంబ్గి(కె), సర్పంచి



మంజీర తాగునీటి పథకం ప్రారంభమైతే మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తీరుతాయి. గ్రామాల్లో ట్యాంకుల నుంచి కుళాయిలకు కనెక్షన్లు ఇచ్చి ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసే అవకాశం ఉంటుంది.

తాగునీటి సమస్య తీరుతుంది
– మున్నూర్ దిగంబర్, ధర్మాపూర్ గ్రామస్థుడు



మంజీరనీటితో రాయికోడ్ మండలంలోని పలు గ్రామాలతో పాటు మా గ్రామంలోనూ తాగునీటి సమస్య తీరే వీలుంది. పథకాన్ని త్వరగా ప్రారంభించి నీటిని సరఫరా చేయాలి. అవాంతరాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి.

నెల రోజుల్లోగా ప్రారంభిస్తాం..
– తాహా, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ



రాయికోడ్, మునిపల్లి మండలాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన మంజీర శాశ్వత తాగునీటి పథకం పనులు పూర్తయ్యాయి. ట్రయల్‌రన్ కొనసాగుతోంది. నెల రోజుల్లోపు పథకాన్ని ప్రారంభించి గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 53 గ్రామాల ప్రజలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది.

పాంపాడ్‌లో ఇంటెక్‌వెల్ నిర్మాణం

రాయికోడ్ మండలంలోని పాంపాడ్ శివారులోని మంజీనదిపై భారీ ఇంటెక్‌వెల్‌ను నిర్మించారు. 105 అశ్వ సామర్థ్యం కలిగిన మోటార్లను ఏర్పాటుచేశారు. మహబ్బత్‌పూర్‌లోని ఫిల్టర్‌బెడ్‌కు పంపింగ్ చేస్తున్నారు. ఇక్కడ ఫిల్టర్‌బెడ్‌లో నీటిని వివిధ ప్రక్రియల్లో శుద్ధి చేసి పలు గ్రామాలకు పైపుమార్గం ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నారు. పెద్దపైపులు 32 కిలోమీటర్లు, చిన్న పైపులు 89 కిలోమీటర్ల చొప్పున గ్రామాల్లో పైపులైన్లను ఏర్పాటు చేశారు. రాయికోడ్ మండలంలోని మహబ్బత్‌పూర్ వద్ద ఓవర్‌హెడ్ ట్యాంక్, ధర్మాపూర్ కూడలి వద్ద అంతర్గత ట్యాంకు, ఓవర్‌హెడ్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఈ ట్యాంకుల సహాయంతో రాయికోడ్, మునిపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులకు కనెక్షన్లు ఇచ్చి.. కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయనున్నారు.


శుద్ధికేంద్రంలో ట్రయల్‌రన్ నీరు



రహదారిపై దర్జా..!

మునిపల్లి మండలం బుధేరా శివారులోని 65వ నంబరు జాతీయ రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. మధ్యాహ్న సమయాల్లో కొంత రద్దీ తక్కువ.. అలాంటి రహదారిపైకి చేరిందో ఆవు. దర్జాగా నడిరోడ్డుపై సేద తీరుతోంది. గమనించక అటువైపు వచ్చే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి నెలకొంది.

బడిబాట.. కాలినడక

పాఠశాలకు వెళ్లాలంటే.. బస్సులు వస్తే వాటిలో వెళ్తారు. లేదంటే తల్లిదండ్రులు సైకిల్ కొనిస్తే వాటిపై వెళ్తారు. రెండూ లేకపోతే.. ప్రభుత్వ సహకారం కరవైతే.. దూరమెంతైనా.. కాలినడక తప్పదు. పోసానిపల్లి నుంచి చౌటకూరుకు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. పోసానిపల్లిలో ప్రాథమిక విద్య మాత్రమే ఉండటంతో.. పై చదువులకు విద్యార్థులు మూడు కిలోమీటర్లు కాలినడక వెళ్లాల్సి వస్తోంది.





శిథిల పలక.. పంటకు రక్షణే ఇక..!

పంటల రక్షణకు రైతులు అడ్డుగా చీరలు...పార్టీ జెండాలు.. దిష్టిబొమ్మలు.. వాడటం అక్కడక్కడ చూస్తుంటాం. మునిపల్లి మండలం కమ్మంపల్లి శివారులో ఓ రైతు పాడైన సోలార్ పలకలను రక్షణ కంచెగా ఏర్పాటు చేశారు. సమీపంలో సోలార్ విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ పనికిరానివి.. దెబ్బతిన్నవాటిని నిరుపయోగంగా వదిలేశారు. వాటిని గమనించిన రైతు.. అక్కడి నుంచి తెచ్చుకొని ఇలా సద్వినియోగం చేస్తున్నారు. జంతువులు, పశువుల బారి నుంచి పంటను రక్షించుకుంటున్నారు.

– చిత్రాలు: న్యూస్‌టుడే, మునిపల్లి, పుల్కల్

వినదగునెవ్వరు చెప్పిన.. అజ్ఞాత శ్రీమంతుడి పాఠాలు!



నగరం గురించి ఏ మాత్రం తెలియని ఒక కుర్రాడు నెల రోజుల్లో నాలుగు ఉద్యోగాలు సంపాదించగలిగాడు. తను చదివిన చదువుకు తగ్గ కొలువా? నచ్చిన ఉద్యోగమా అని చూడలేదు. చేతిలో రూ.500 మాత్రమే ఉన్నాయి.. నెలరోజులు ఊరు కానీ ఊరులో బతకాలి. శ్రీమంతుల కుటుంబం నుంచి వచ్చినా తమ కుటుంబ కట్టుబాట్ల మేరకు గుర్తింపును వెల్లడించకూడదు. ఇటువంటి పరిస్థితుల్లో గుజరాత్ నగల వ్యాపారి కుటుంబం నుంచి వచ్చిన హితార్థ్ ఘన్‌శ్యాం డోలాకియా తను అనుకున్నది సాధించాడు. నెల రోజుల ప్రయాణంలో మనకు ఎన్నో పాఠాలను చెప్పకనే చెప్పి వెళ్లాడు.

– ఈనాడు, హైదరాబాద్



హితార్థ్

ఖాళీగా ఉండొద్దు..



నగరంలో చాలామంది కుర్రకారు ఉద్యోగాలు దొరక్క ఖాళీగా ఉంటున్నారు. నచ్చిన కొలువు వచ్చేదాక ఎదురుచూసే వారు మరికొందరు. ఖాళీగా కుటుంబానికి భారమవుతున్నామనే దిగులు ఉన్నా.. అడుగు ముందుకు పడక సతమతమయ్యే వారు ఎందరో. ఖాళీగా ఉండకుండా మొదట దొరికిన ఉద్యోగంలో చేరాలి. అక్కడి అనుభవం.. పరిచయాలు కోరుకున్న కొలువుకు బాటలు పడేలా చూసుకోవాలి. నచ్చకపోతే మనసు చంపుకుని పనిచేయాల్సిన పనిలేదు. మరో ఉద్యోగంలో చేరొచ్చు.

మౌనం వీడాలి



చిన్న కుటుంబాలు.. బడి, కళాశాల తప్ప మరో ప్రపంచం తెలియని చాలా మంది కుర్రాళ్లు చదువులో ముందుంటే ఫర్వాలేదు. ప్రాంగణ నియామాల్లోనే కొలువులు దొరుకుతాయి. అందరూ చదువుల్లో చురుగ్గా ఉండకపోవచ్చు కదా! బయట ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నప్పుడు ఎక్కువ మందితో మాటలు కలపాలి. పరిచయాలు పెంచుకోవాలి. ఆటోడ్రైవర్, క్యాబ్‌డ్రైవర్, టీకొట్టు ఇలా ఎవరైనా కావొచ్చు. సమాచారం కోసం వారిని సంప్రదించడంలో తేలికభావం వద్దు. గుజరాత్ కుర్రాడికి సలహా ఇచ్చింది ఓ ఆటోవాలా.

నైపుణ్యాలు మెరుగు



ఉద్యోగాలకు కావాల్సింది కమ్యూనికేషన్ స్కిల్స్. ఈ రోజుల్లో భాషానైపుణ్యాలు చాలాముఖ్యమని ఇప్పటికే ఉద్యోగవేటలో ఉన్నవారికి అనుభవంలోకి వచ్చి ఉంటుంది. డిగ్రీలు లేకపోయినా.. చేతిలో సర్టిఫికెట్లు లేకపోయినా నైపుణ్యం ఉంటే సిటీలో కొలువు సంపాదించడం పెద్ద కష్టమేమి కాదని మరోసారి నిరూపితం అయ్యింది. గుజరాత్ కుర్రాడు హిందీ, ఇంగ్లీష్ బాగా మాట్లాడటంతో కొలువు సంపాదించడానికి ఎక్కువ శ్రమ పడాల్సిన అవసరం రాలేదు.



ప్రయత్నం ఆపొద్దు

కొన్నాళ్లు ప్రయత్నించాక ఉద్యోగం దొరకలేదని నిరుత్సాహ పడి కొలువుల వేట మానేస్తారు. ప్రయత్నం ఆపొద్దు అనేది గుజరాత్ కుర్రాడు నేర్పిన పాఠం. ఊరు నుంచి నగరానికి వచ్చాక సిటీలో రెండురోజు జాలీగా గడిపాక.. ఇలా వాయిదాలు వేయకుండా తొలిరోజు నుంచే ప్రయత్నం మొదలెట్టాలి. మీ ప్రయత్నాన్ని చూసి ఇతరులు చేయూతనిచ్చే అవకాశం ఉంది.



ఉన్న చోటు నుంచి..

ఉద్యోగ వేటలో ఉన్న చోటనే అంటే కొన్నిసార్లు దొరకపోవచ్చు.. అవసరమైతే ఊరు వదిలి.. నగరం దాటి వెళ్లడానికి సిద్ధపడాలి. సొంత నగరంలో చిన్న ఉద్యోగాలంటే నామోషిగా భావిస్తుంటారు. అడ్డంకుల్ని తెలియని ప్రాంతంలో అధిగమించవచ్చు. అక్కడి భాష నేర్చుకోవడం వంటి కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవచ్చు. హైటెక్‌సిటీలో ఉద్యోగాల కోసం నాగోల్‌లో ఉండి ప్రయత్నించే బదులు.. మణికొండలో ఉంటే ప్రయాణభారం తగ్గుతుంది. అమీర్‌పేటలో ఉంటే ఐటీ రంగంలో పోకడలు.. ఏ విభాగంలో ఉద్యోగాలు ఉన్నాయనే విషయాలు సులభంగా తెలుస్తాయి. ఇక్కడే అద్దె గదుల్లో, హాస్టల్‌లో ఉంటున్నప్పుడు ప్రాంతం మారడానికి కూడా సిద్ధపడక వెనకబడి పోతుంటారు.



గుర్తుంచుకోవాలి

ప్రతి దశలో ఎవరో ఒకరు ఏదో రూపంలో సాయపడుతూనే ఉంటారు. ప్రతిఫలం ఆశించకుండా చూసే వారే ఎక్కువ శాతం ఉంటారు. సమాజంలో మంచి ఇంకా బతికే ఉందని వీరు గుర్తు చేస్తుంటారు. ఇది మున్ముందు కొనసాగాలంటే ఇలాంటి వ్యక్తులను మర్చిపోకుండా.. ఉన్నతస్థానంలో ఉన్నప్పుడు అవసరమైన వారికి మీకు తోచిన రూపంలో సాయం చేయడానికి ప్రయత్నించాలి.





అమీర్‌పేట ప్రధాన రహదారిలో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు ఎండిపోయాయి. అక్కడే మరోచోట రహదారికి అడ్డంగా విభాగినుల వద్ద ప్రయాణాలు సాఫీగా సాగకుండా పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. నిర్వహణలో లోపాల వల్ల అవసరమైన చోట లేకుండా.. అనవసరమైన చోట పెరుగుతున్నాయి.

మారాలి.. మారి తీరాలి

ఏటా రూ.70 కోట్లకు పైగానే జరిమానాలు ● పాయింట్ల నేపథ్యంలో మార్పు అవశ్యం

ఈనాడు, హైదరాబాద్



శిరస్త్రాణం ధరించకుండా వాహనం నడిపినందుకో.. ఎర్రలైటు పడినా సిగ్నల్ జంపింగ్ చేసినందుకో.. మద్యం తాగి వాహనం నడుపుతూ దొరికినందుకో.. ఇలా ఉల్లంఘన ఏదైనా కానీ రాజధాని నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో వాహనదారులు ప్రతి రోజు చెల్లిస్తున్న సగటు జరిమానా ఎంతో తెలుసా..? దాదాపు రూ.9లక్షల పైమాటే. ఈలెక్కన ఏటా సుమారు రూ.70 కోట్లకుపైగానే జరిమానాల రూపంలో ఉల్లంఘనుల జేబుల్లో నుంచి ప్రభుత్వ ఖజానాకు జమ అవుతోంది. ప్రస్తుతం పాయింట్ల నమోదుతో జరిమానాలకు తోడు అవీ తోడైతే లైసెన్స్ పైనే ప్రభావం చూపనుంది. ఈనేపథ్యంలో వాహనదారులు మారి తీరాల్సిన అవసరం ఏర్పడింది.

మోటారు వాహనాల చట్టం నిబంధనల్ని ఉల్లంఘించే వాహనదారులపై దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో మాత్రమే పాయింట్ల విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానం కేంద్ర మోటారు వాహనాల చట్టంలోనే ఉన్నా దేశంలో ఇంకా ఎక్కడా అమల్లో లేదు. తొలిసారిగా తెలంగాణాలో.. అదీ హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోనే ఈనెల నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో జరిమానాలకు తోడు లైసెన్స్‌దారులపై పాయింట్లను నమోదు చేస్తున్నారు. రెండేళ్లలో 12 పాయింట్లు నమోదైతే లైసెన్స్ రద్దు చేసే సన్నాహాల్లో ట్రాఫిక్ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈక్రమంలో వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటివరకు ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానాలు చెల్లించి బయటపడే పరిస్థితి ఉండేది. ఇకపై కూడా అలా బయటపడతామనుకుంటే కుదరదు. మొదటికే మోసం రావొచ్చు. ఉల్లంఘనలు హద్దు మీరితే మీరు వాహనం నడిపే అవకాశముండదు. అయినా సరే అని మొండికేస్తే ఊచలు లెక్కించడం ఖాయం. అందుకే వాహనాన్ని రోడ్డు పైకి తీసుకొచ్చే ముందే తగిన స్పృహ ఉండాలి.

ప్రస్తుతమైతే రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కితేనే..

ప్రస్తుతం ఈ మూడు కమిషనరేట్ల పరిధిలో కాంటాక్టు, నాన్‌కాంటాక్టు పద్ధతిలో జరిమానాలు విధిస్తున్నారు. ఉల్లంఘనుల్ని గుర్తించినప్పుడు రహదారులపైనే ఆపి జరిమానా విధించడాన్ని కాంటాక్ట్ చలానాగా.. వాహనదారుడిని ఆపకుండానే ట్రాఫిక్ సిబ్బంది చేతిలోని కెమెరానో లేక కూడళ్లు, ప్రధాన రహదారులపై ఉన్న సీసీ కెమెరాలు చిత్రీకరించే ఉల్లంఘనల్ని కంట్రోల్ రూంలోని సిబ్బంది సంగ్రహించడం ద్వారానో జరిమానా విధించడాన్ని నాన్ కాంటాక్ట్ చలానాగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పాయింట్ల విధానం అమలైన తర్వాత ఈ రెండు విధాలా జరిమానాలు యథావిధిగానే ఉండనున్నాయి. వీటికితోడు ఉల్లంఘనుల్ని గుర్తించి వారి లైసెన్స్‌లపై పాయింట్లను నమోదు చేస్తున్నారు. ఇప్పటికైతే కేవలం వాహన తనిఖీల సమయంలో గుర్తించిన ఉల్లంఘనులపై మాత్రమే పాయింట్లను నమోదు చేస్తున్నారు. ఎందుకంటే.. పాయింట్లను నమోదు చేసేది వాహనదారుడి లైసెన్స్ పైనే కాబట్టి అలా చేస్తున్నారు. ఉల్లంఘనకు పాల్పడిన వాహనదారుడిని గుర్తించినప్పుడు మాత్రమే అతడి లైసెన్స్‌పై పాయింట్లు నమోదు చేసే అవకాశముంది. ఒకవేళ ఒకరి వాహనాన్ని మరొకరు తీసుకెళ్లి ఉల్లంఘనకు పాల్పడితే.. ప్రత్యక్షంగా అతడిని గుర్తించకుండా లైసెన్స్‌పై పాయింట్లను నమోదు చేయడం సరికాదు కాబట్టి ఇలా చేస్తున్నారు. కానీ సమీప భవిష్యత్తులో నాన్‌కాంటాక్ట్ పద్ధతిలోనూ పాయింట్లను నమోదు చేసే అవకాశముండటంతో ఇప్పటినుంచే వాహనదారులు జాగ్రత్త పడటం అలవాటు చేసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలు ఇలా..

నగర కమిషనరేట్ పరిధిలో ఇదీ పరిస్థితి..

ఏడాది	కేసులు	జరిమానాలు
2014	30,47,169	రూ. 35,75,46,610
2015	30,23,086	రూ. 32,25,45,023
2016	30,87,499	రూ. 31,02,61,375
2017 జూన్ వరకు	13,46,248	రూ. 10,98,55,915

సైబరాబాద్, రాచకొండ పరిధిలో..

కమిషనరేట్	కేసులు	జరిమానా
సైబరాబాద్	12,40,027	రూ. 28,65,81,355
రాచకొండ	2,61,643	రూ.10,23,79,750

(గత ఏడాది గణాంకాలు మాత్రమే)



చిన్నప్పటి నుంచి పిల్లలు అడిగిందల్లా కొని ఇవ్వడం వారి భవిష్యత్తుకే ముప్పుగా మారుతోంది. దాని ధరతో సంబంధం లేకుండా చాలామంది పిల్లలు వారికి నచ్చిన వస్తువునల్లా కొనిమ్మని తల్లిదండ్రులను పట్టుపడుతుంటారు. వాటి అవసరం ఏమేరకు ఉందో లెక్కించకుండా పిల్లలు అడిగారని చాలా మంది తల్లిదండ్రులు కొనేయడం పరిపాటిగా మారింది. దీనితో పిల్లలు పెడదారి పట్టడానికి ఎక్కువ ఆస్కారం ఉందని నిపుణులు వివరిస్తున్నారు. పిల్లలు చిన్నచిన్న కష్టాలు ఎదుర్కొనేలా చేయాలని వారు వివరిస్తున్నారు. చాలామంది పిల్లలకు పొదుపు అనేదే తెలియట్లేదని, చిన్నవయస్సు నుంచే ఆ పాఠాలు నేర్పితే భవిష్యత్తులో వారికి అది మంచి అలవాటు అవుతుందని వారు వెల్లడిస్తున్నారు.



చిన్న వయస్సుకి పొదుపు పాఠాలు!

- అడిగిందల్లా ఇవ్వడం మంచిది కాదు
- వద్దన్నా వినేలా తర్ఫీదు ఇవ్వాలి
- చిన్న చిన్న కష్టాలు ఎదుర్కొనేలా చేయాలి

ఈనాడు, హైదరాబాద్

హైదరాబాద్ మహా నగరానికి విద్య, ఉద్యోగరీత్యా వస్తున్న వారే ఎక్కువ. ఉదయం నుంచి రాత్రివరకు విధుల్లో పూర్తిగా నిమగ్నమవ్వడం.. ఇంటికి రావడంతో అలసిపోయి పిల్లల గురించి పట్టించుకోకుండా ఉండేవారే నగరంలో ఎక్కువగా ఉంటున్నారు. కొందరు మాత్రం ఏ కొద్ది సమయం ఖాళీగా ఉన్నా కుటుంబసభ్యులతో గడుపుతున్నారు. పిల్లలు అడిగిందల్లా కొనిఇవ్వడంలో మాత్రం ఆచితూచి చూసేవారు తక్కువే. ఒకరిని చూసి మరొకరు వస్తువు ధరతో సంబంధం లేకుండా కొని ఇచ్చే అలవాటు పిల్లలకు చేసేస్తున్నారు. ఇదే వారికి ముప్పు తీసుకొస్తోంది. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో పిల్లల పేరున పొదుపు ఖాతా తెరచి వారికి పొదుపు చేయడం అలవాటు చేయాలని నిపుణులు వివరిస్తున్నారు. ప్రోత్సాహకంగా ఇచ్చిన నగదుని పిల్లలు పొదుపు చేసే విధానం అలవాటుగా మార్చాలని వారు పేర్కొంటున్నారు.

చిన్న వయస్సులోనే బైకులు.. ముప్పు

నిండా పదేళ్లు పూర్తి కాకుండానే పిల్లలకు ద్విచక్ర వాహనాలు కొని ఇచ్చేస్తున్నారు. వారికి లైసెన్స్ లేకుండానే సందుల్లో తొక్కుకుంటాడు అంటూ తల్లిదండ్రులు వత్తాసు పలుకుతున్నారు. అలా మొదలైన వారి ప్రయాణం ఏదో ఒకచోట దుర్ఘటనలకు దారితీస్తోంది. నగరంలో చాలామంది విద్యార్థులు ఈ తరహా ప్రమాదాలకు గురవుతున్నారు. చాలామంది తల్లిదండ్రులు పిల్లలకు నచ్చిన వాహనాలు కొని ఇచ్చేస్తున్నారు. ఇటీవల పలు ప్రమాదాలకు మైనర్లే కారణమవుతున్నట్లు పోలీసుల గణాంకాలు వివరిస్తున్నాయి.

పిల్లల చేతుల్లో ఖరీదైన చరవాణులు.. వద్దు

ఏమాత్రం ఖాళీ దొరికినా పిల్లలు చరవాణులతోనే ఆడుకుంటున్నారు. వీరు వినియోగించేవి అత్యంత ఖరీదైనవి కావడం విశేషం. చిన్నపిల్లలు ఏడిస్తే కూడా చరవాణిలో పాటలు పెట్టడం లేదా ఆటలాడుకొనేలా ప్రోత్సహించడం చాలామంది తల్లిదండ్రులు అలవాటు చేసేస్తున్నారు. పిల్లలను సంరక్షణ కేంద్రాల్లో రోజంతా ఉంచి.. సాయంత్రం వారిని ఇళ్లకు తీసుకొచ్చింది మొదలు 70శాతం మహిళలు వారికి చరవాణులు ఇస్తున్నట్లు ఇటీవల నగరంలో ఒక సర్వేలో తేలింది. పిల్లలకు ఆట వస్తువులు ఇవ్వకుండా చరవాణులే ఇవ్వడంతో వారికి వచ్చే ఇబ్బందుల గురించి తెలియకే ఇలా చేస్తున్నామని 40శాతం మంది మహిళలు తెలిపారు.



ట్యాబ్‌లలోనే పాఠాలు..?

నగరంలో చాలా ప్రైవేటు పాఠశాలలు హైటెక్ హంగులను ప్రదర్శిస్తున్నాయి. మూడు, నాలుగో తరగతుల్లో పిల్లలకు ట్యాబ్‌లను అలవాటు చేస్తున్నాయి. మా పాఠశాలలో హోమ్‌వర్కు ట్యాబ్‌ల్లోనే చేయాల్సి ఉంటుందని యాజమాన్యాలు వివరిస్తున్నాయి. దీంతో చిన్నవయస్సులోనే చరవాణులకు పిల్లలు అలవాటుపడిపోతున్నారు. అదే అలవాటుగా మారి పర్యవేక్షణ లేక ఇంటర్‌నెట్‌లో అందుబాటులో ఉండే నీలిచిత్రాలు, బొమ్మలు వారిపై ప్రభావం చూపి పెడదారి పట్టే ప్రమాదం ఉందని నిపుణులు వివరిస్తున్నారు. చదువుపై శ్రద్ధ తగ్గే ప్రమాదం ఉందంటున్నారు.

ఇలా చేస్తే మేలు..

- పుస్తకాలు, కథలు, పత్రికలు చదివించడం అలవాటు చేయాలి.



- ఇతర పిల్లలతో కలిసి ఆడుకునే వీలుంటే అందుకు కొంత సమయం కేటాయించాలి.



- పొదుపు పాఠాలు నేర్పాలి. వారిని ప్రోత్సహించేందుకు ఇచ్చే ప్రతి రూపాయి దాచుకొనే అలవాటు చేయాలి. వాటితోనే వారికి కావాల్సిన వస్తువులను కొనుగోలు చేయించాలి.



- చిన్న వయస్సు వారికి వాహనాలు కొని ఇవ్వడం మంచిది కాదు.
- ఇంట్లో చేసే పనుల్లో చిన్నచిన్నవి వారికి అప్పగించాలి. దగ్గరలోని దుకాణాలకు వారిని పంపించి కొనడం అలవాటు చేయాలి.
- చరవాణులు, కంప్యూటర్లకు పిల్లలను సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచితే మంచిది.



మీ పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లోనే..: సుధీర్‌కుమార్, వ్యక్తిత్వ వికాస నిపుణులు

నగరంలో చాలామంది తల్లిదండ్రులు.. తమ పిల్లలు అడిగిందల్లా కొనేస్తున్నారు. దాని విలువ, ఉపయోగం గురించి అవగాహన కల్పించకుండానే కోరికలు తీర్చేస్తున్నారు. కొనిపించుకున్న కొద్ది రోజులకే వాటిని పక్కన పడేస్తున్నారు. పిల్లల భవిష్యత్తు మంచిగా ఉండాలంటే వారు చిన్న చిన్న కష్టాలు ఎదుర్కొనేలా చూడాలి. అడిగిందల్లా ఇచ్చి వారిని ప్రమాదాల్లోకి నెడుతున్నారనే విషయాన్ని గుర్తించాలి. చాలామంది పిల్లలు.. తమ స్నేహితులను చూసి కోరికలు పెంచుకుంటున్నారు. వాహనం, ఖరీదైన చరవాణి ఇలా పలు వస్తువులను కోరిన వెంటనే ఇవ్వడంతో వారి భవిష్యత్తుని తల్లిదండ్రులే అంధకారంలోకి నెట్టేస్తున్నారని గుర్తించాలి.



కోరి వస్తోన్న కొలువు.. రారమ్మంటోన్న చదువు

మాదాపూర్ న్యూస్‌టుడే

కళాశాల చదువు ముగుస్తుందో.. లేదో.. తెలియగానే యువత ఉద్యోగాల కోసం వెతుకుతుంటారు. ప్రాంగణ నియామకాలు.. నేరుగా దరఖాస్తు చేయడం.. ఇలా ఏ అవకాశాన్ని వదలరు. చదువు ముగిసేలోగానే కొలువును కోరుకుంటుంటారు.. అయితే.. ఇటీవల నగర యువత ఆలోచనలో మార్పు కనిపిస్తోంది..

డిగ్రీ పూర్తికాగానే ఏదైనా మంచి కంపెనీలో ఉద్యోగం చేయాలి.. పట్టా చేతికి రాగానే బహుళజాతి కంపెనీలో చేరిపోవాలి.. ప్రాంగణ నియామకాల్లో కొలువు వెతుక్కుంటూ వస్తే ఎగిరి గంతెయ్యాలి.. అనుకునే విద్యార్థులు తగ్గుతున్నారు. ప్రస్తుతం చాలా మంది డిగ్రీతో వచ్చే ఉద్యోగాలపై ఆసక్తి చూపడం లేదు. ఉన్నత చదువులకు వెళ్లేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఏడాదికి రూ. 15 నుంచి 20 లక్షల వేతనాల జాబ్ ఆఫర్లను కూడా కాదనుకొని తమకు ఆసక్తి ఉన్న కోర్సుల్లో పీజీ, పీహెచ్‌డీ చేసేందుకు పోటీపడుతున్నారు. తాము ఎంచుకున్న కోర్సులో పూర్తిస్థాయి పట్టుసాధించాలనే తపనతో ఉన్నత చదువులకు వెళ్తున్నారు. ట్రిపుల్‌ఐటీ, ఐఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నత చదువులే లక్ష్యంగా మెరుగైన భవిష్యతుకు బాటలు వేసుకుంటున్నారు. కొందరైతే కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వచ్చిన ఉద్యోగం వదులుకోక కొన్నాళ్లపాటు అక్కడి పనిచేస్తున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకున్నాక ఉద్యోగం మానుకొని ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్తున్నారు. డిగ్రీ స్థాయిలో పరిశోధనలపై ఆసక్తి పెంచుకుంటున్న యువత ఆయా రంగాల్లో మరింత జ్ఞానం పెంచుకునేందుకే ఉన్నత చదువుల వైపు మొగ్గుచూపుతున్నారు.

బోధనపై ఎక్కువ ఆసక్తి

ఉన్నత చదువులకు వెళ్తున్న యువతలో అధిక శాతం బోధన రంగంలో స్థిరపడేందుకు ఇష్టపడుతున్నారు. పీజీ, పీహెచ్‌డీ చేశాక మంచి విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్నారు. తాము నేర్చుకున్న విద్యను, జ్ఞానాన్ని నలుగురికి పంచాలనుకుంటున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ.. ఇలా ఉన్నత చదువులకు క్యాంపస్‌లో దాదాపు పదేళ్లు గడుపుతున్న యువత చదువులయ్యాక అక్కడే అధ్యాపకులుగా పనిచేసేందుకు సిద్ధమవుతున్నారు. పై చదువులపై తమ పిల్లలు చూపుతున్న ఆసక్తిని తల్లిదండ్రులు ప్రోత్సాహం అందిస్తున్నారు.

ఆలోచనలకు 'అంకుర'ం

సాంకేతిక విద్యార్థులు మాత్రం డిగ్రీస్థాయిలో పరిశోధనల వైపు దృష్టిసారిస్తున్నారు. డిగ్రీ పూర్తికాగానే సమాలోచనలు జరిపి తోటి స్నేహితులతో కలిసి అంకుర సంస్థల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా కంప్యూర్‌సైన్స్ రంగంలో ఉన్న యువత సరికొత్త మొబైల్ అప్లికేషన్స్, సాఫ్ట్‌వేర్ ఆవిష్కరణలను వెలుగులోకి తీసుకవచ్చేందుకు అంకిత భావంతో కష్టపడుతున్నారు. ఇలా విద్యార్థులు డిగ్రీ అయ్యాక ఉద్యోగంలో చేరడం కంటే ఉన్నత చదువులు లేదా సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనే ఆశయంతో ఉంటున్నారు.

బోధన రంగంలో ఆసక్తి: సౌజన్య పొన్నపల్లి, బీటెక్, ట్రిపుల్‌ఐటీ




ట్రిపుల్‌ఐటీలో పరిశోధనలు, అకడమిక్స్ రెండింటికి ప్రాధాన్యం ఇస్తారు. ప్రాంగణ నియామకాల్లో నాకు ఓ బహుళ జాతి కంపెనీలో మంచి ఉద్యోగం వచ్చింది. ఏడాదికి రూ.22 లక్షల వేతనం. బోధనపై ఆసక్తి ఉండటంతో పీహెచ్‌డీ చేయాలనే లక్ష్యంతో ఉన్నాను. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఎంఎస్, పీహెచ్‌డీ సీటు వచ్చింది.

అమెరికాలో ఉన్నత చదువులు: ప్రియదర్శిరథ్, ట్రిపుల్‌ఐటీ



మాది జార్ఖండ్. అమ్మానాన్న వైద్యులు. బయాలజీ సబ్జెక్టుపై ఆసక్తి లేకపోవడంతో కంప్యూటర్‌సైన్స్ వైపు వచ్చాను. మా తల్లిదండ్రులు నాకు ఇష్టమైన కోర్సును ఎంపిక చేసుకునే స్వేచ్ఛను ఇచ్చారు. ఇష్టపడి చదవటంతో నేను బీటెక్ ఈసీఈలో బంగారు పతకం సాధించగలిగాను. అమెరికాలోని ఓ ప్రముఖ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ సీటు వచ్చింది.

ఐఐటీ ముంబయిలో పీహెచ్‌డీ చేస్తా: కౌత్సవ్‌సేన్‌గుప్తా, ట్రిపుల్‌ఐటీ



ఎంటెక్ సీఏఎస్ఈ కోర్సు చేశాను. బంగారు పతకం సాధించా. ఇది నాకు రెట్టింపు ఉత్సాహాన్ని ని చ్చింది. ఐఐటీ ముంబయిలో పీహెచ్‌డీ సీటు వచ్చింది. పీహెచ్‌డీ అయ్యాక విద్యాబోధన చేయాలని ఉంది. మా స్వస్థలం కోల్‌కత్తా. నాన్న విశ్రాంతి ఉద్యోగి. అమ్మ గృహిణి. డిగ్రీలో చేరిన ఏడాది నుంచి ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితం వస్తుంది.







నంబరు దాచిపెట్టు... చలానాకు మస్కా కొట్టు..

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన సమయంలో సీసీ కెమెరాల ద్వారా కేసులు బుక్ చేయడంతో పాటు... పాయింట్లు విధిస్తుండటంతో వాహన చోదకులు కొత్త దారులు వెతుక్కుంటున్నారు. వాహనాలపై నంబర్లను కనిపించకుండా చేయడమో... ఏదో ఒక అక్షరాన్ని చెరిపివేయడమో చేస్తున్నారు.

ప్రతిభ



టీఎస్‌పీఎస్‌సీ

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగులకు తీపి కబురు ప్రకటించింది. మొత్తం 2345 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ శాఖల్లో జనరల్ రిక్రూట్‌మెంట్ కింద ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఖాళీలు, అర్హతలు, ఎంపిక విధానం మొదలైన వివరాలు..

ముఖ్యమైన తేదీలు

★ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పోస్టులకు: *9 సెప్టెంబరు*
★ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు: *12 సెప్టెంబరు*
★ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు, లెక్చరర్ పోస్టులు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులకు: *15 సెప్టెంబరు*

1857 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

మొత్తం ఖాళీలు: 1857
వయసు: 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: రూ.16,400 - 49,870
అర్హత: ఇంటర్ లేదా తత్సమాన అర్హత అవసరం.

★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.

పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.

పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.

★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం.

చివరి తేదీ: 12 సెప్టెంబరు

సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు

★ మొత్తం ఖాళీలు: 205.
★ విభాగాల వారీగా ఖాళీలు: అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ - 41, పీడియాట్రిక్స్ - 27, అనెస్థీషియా - 39, ఆర్థోపెడిక్స్ - 5, ఈఎన్‌టీ - 20, డెర్మటాలజీ - 1, పాథాలజీ - 16, జనరల్ మెడిసిన్ - 34, సైకియాట్రిక్ - 3, రేడియాలజీ - 3, జనరల్ సర్జరీ - 16.
★ అర్హత: సంబంధిత విభాగంలో పీజీ డిగ్రీ/ డిప్లొమా లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: పేపర్ - 1లో జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
  ✪ పేపర్ - 2లో సెక్షన్ - ఎ, సెక్షన్ - బి అనే రెండు విభాగాలు ఉంటాయి. సెక్షన్ - ఎలో బేసిక్ యూజీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు (అందరికీ కామన్). సెక్షన్ - బిలో సంబంధిత పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
  ✪ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 90
★ అర్హత: అగ్రికల్చర్ ఒక సబ్జెక్టుగా ఏదైనా డిగ్రీ లేదా బోటనీ/ ఫారెస్ట్రీ/ హార్టికల్చర్/ జువాలజీ/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ జియాలజీలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి లేదా కెమికల్/ మెకానికల్/ సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 31 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.21,230 - 63,010
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.

పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.

పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.

★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమవుతాయి.

చివరి తేదీ: 12 సెప్టెంబరు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 67.
★ అర్హత: అగ్రికల్చర్/ బోటనీ/ కెమిస్ట్రీ/ కంప్యూటర్ అప్లికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్/ ఇంజినీరింగ్ (అగ్రికల్చర్/ కెమికల్/ సివిల్/ కంప్యూటర్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్)/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ ఫారెస్ట్రీ/ జియాలజీ/ హార్టికల్చర్/ మ్యాథమెటిక్స్/ ఫిజిక్స్/ స్టాటిస్టిక్స్/ వెటర్నరీ సైన్స్/ జువాలజీలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.31460 - 84970
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: జనరల్ ఇంగ్లిష్ పేపర్ (100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100), మ్యాథమెటిక్స్ పేపర్ (ఎస్ఎస్‌సీ/ హయ్యర్ స్కూల్ స్టాండర్డ్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100)లో సాధించిన మార్కులను క్వాలిఫయింగ్ మార్కులుగా పరిగణిస్తారు. 150 మార్కులకు జనరల్ స్టడీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. ఆప్షనల్ పేపర్‌లో (ఏదైనా ఒకటి మాత్రమే) 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మరో 50 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 12 సెప్టెంబరు

ట్యూటర్

★ మొత్తం ఖాళీలు: - 65
★ విభాగాల వారీగా ఖాళీలు: క్లినికల్ - 33. ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ నాన్ - క్లినికల్ - 32. ఎంబీబీఎస్/ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.(మెడికల్ స్పెషాలిటీ విభాగాల్లో)
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఉద్యోగాలు Jobs

★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
★ పేపర్ - 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ పేపర్ - 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 43.
★ అర్హత: ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,780
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.

పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఉంటాయి. సమయం: రెండున్నర గంటలు, మార్కులు 150.

పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు: 300. వ్యవధి: రెండున్నర గంటలు.

★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 10.
★ అర్హత: బీడీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ స్టేట్ డెంటిస్ట్స్ రిజిస్ట్రేషన్ ట్రైబ్యునల్‌లో లేదా ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు.

పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 150.

పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో డెంటల్ సర్జరీకి సంబంధించి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.

★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

లెక్చరర్లు

★ మొత్తం ఖాళీలు: 6
★ విభాగాలు: రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిక్స్
★ అర్హత: ప్రథమశ్రేణి మార్కులతో ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎంఎస్సీ ఉత్తీర్ణతతోపాటు బార్క్ నుంచి హాస్పిటల్ ఫిజిక్స్, రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రెయినింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ. 37,100 - 91,450
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.

పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.

పేపర్ – 2: పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా స్థాయిలో రేడియోలాజికల్ ఫిజిక్స్/ మెడికల్ ఫిజిక్స్‌కు సంబంధించి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.

★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

★ ఖాళీలు: 2
★ అర్హత: ఫిజియోథెరపీలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.17,890 - 53,950
★ ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా.
★ పరీక్షా విధానం: మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి.

పేపర్ 1: జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు 150. సమయం: రెండున్నర గంటలు.

పేపర్ 2: ఫిజియోథెరపీ (డిప్లొమా స్థాయిలో) నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు 150.

★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.tspsc.gov.in**

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✪ ఖాళీలు: హిస్టరీ, ఆర్కియాలజీ - 1.
✪ తెలుగు, ఓరియంటల్ లాంగ్వేజెస్ - 1.
✪ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ - 1.
✪ సోషియాలజీ, సోషల్ వర్క్ - 1.
✪ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఛైర్ - 1.
✪ జువాలజీ - 1.
✪ బోటనీ, మైక్రోబయాలజీ - 1.
✪ మ్యాథమెటిక్స్ - 1.
✪ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ - డీన్ - 1.
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
✪ పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు 'రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, నాగార్జున నగర్ - 522510, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్' పేరిట ఎస్‌బీఐలో తీసిన రూ.2 వేల డీడీ జతచేసి పంపాలి.

చివరి తేదీ: 9 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.anu.ac.in**

బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ

శ్రీకాకుళంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✪ వివరాలు: ఆర్ట్స్: ప్రొఫెసర్ (లా - 1, సోషల్ వర్క్ - 1)
✪ సైన్స్: ప్రొఫెసర్ (బయోటెక్నాలజీ - 1, మ్యాథమెటిక్స్ - 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ - 1).
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
✪ రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2000

చివరి తేదీ: *29 ఆగస్టు*

✪ వెబ్‌సైట్: **www.brau.edu.in**

ఐఐఎం, విశాఖపట్నం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయనుంది.

✪ ఖాళీలు: అకౌంటెంట్ -1, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) - 1, జూనియర్ ఇంజినీర్ -1, సీనియర్ లైబ్రరీ అండ్ ఇన్ఫో అసిస్టెంట్ - 1, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్ - 1.

వెబ్‌సైట్: **www.iimv.ac.in**

IBPS - RRBs Recruitment


No. of Questions: 80 **Maximum Marks: 80** **Time: 45 Mts.**

ప్రతిభ

IBPS Officers Prelims Model Paper - 2017

(నిన్నటి తరువాయి)

(37 – 39):




37. I. ✔ II. ✔
Both I and II follows.

38. I. ✔ II. ✕
Only I follows.

39. I. ✕ II. ✕
Neither I nor II follows.

40.



I. ✕ II. ✔
Only II follows.

41. 8 × 20 men = 8 × 32 women
⇒ 5 men = 8 women
5 men + 8 women = 16 women
$M_1D_1 = M_2D_2$
⇒ $8 \times 32 = 16 \times D_2$
⇒ $D_2 = \frac{8 \times 32}{16} = 16$ days

42. Side of the square
$= \sqrt{1024} = 32$ cm.
∴ Length of rectangle
= 2 × 32 = 64 cm.
Breadth of rectangle = 32 – 12 = 20 cm.
∴ Required ratio = 64 : 20 = 16 : 5

43. x + x + 2 + x + 4 + x + 6 + x + 8 = 220
⇒ 5x + 20 = 220 ⇒ x = 40
Second lowest number of different set
= 2 × 40 – 37 = 43
∴ Required sum
= 42 + 43 + 44 + 45 + 46 = 220

44. Bus fare = Rs. 420
Train fare $= 2 \times 420 \times \frac{3}{4}$ = Rs. 630
∴ Required total fare
= Rs. (2 × 420 + 4 × 630) = Rs. (840 + 2520)
= Rs. 3360

45. Speed of tractor $= \frac{360}{12} = 30$ kmph
Speed of jeep $= 30 \times \frac{250}{100} = 75$ kmph
∴ Speed of car $= \frac{3}{5} \times 75 = 45$ kmph
∴ Average speed of car and jeep together
$= \left(\frac{75 + 45}{2}\right)$ kmph = 60 kmph

46. Gita's average earnings
$= \frac{140 + 200 + 420 + 400}{4} = \frac{1160}{4}$ = Rs. 290

47. Amount earned by Rahul and Naveen
= 180 + 260 + 340 + 160 = Rs. 940

48. Naveen's total earnings on Wednesday
= 420 + 120 = Rs. 540

49. Required difference = 240 – 200 = Rs. 40

50. Required ratio = 360 : 120 : 160
= 9 : 3 : 4

51. It is obvious from the table.

52. Percentage increase in 2006
$= \frac{-12.5 - 5.3}{5.3} \times 100 = 136$

53. Required difference
= (14.5 – 6.6) × 1000 = Rs. 7900

54. Total monthly rent at Virar over the years
= (1.1 + 2.1 + 1.8 + 3.6 + 5.5 + 7.8) × 1000
= Rs. 21900
∴ Required percentage $= \frac{9800}{21900} \times 100 = 45$

55. It is obvious from the table.

56. **I.** $5x^2 - 18x + 9 = 0$
⇒ $5x^2 - 15x - 3x + 9 = 0$
⇒ 5x(x – 3) – 3 (x – 3) = 0
⇒ (x – 3) (5x – 3) = 0
∴ x = 3 or $\frac{3}{5}$
II. $20y^2 - 13y + 2 = 0$
⇒ $20y^2 - 8y - 5y + 2 = 0$
⇒ 4y (5y – 2) – 1 (5y – 2) = 0
⇒ (4y – 1) (5y – 2) = 0
∴ y = $\frac{1}{4}$ or $\frac{2}{5}$
Clearly, x > y

57. **I.** $x^3 = 878 + 453 = 1331$
∴ $x = \sqrt[3]{1331} = 11$
II. $y^2 = 82 + 39 = 121$
∴ $y = \sqrt{121} = \pm 11$
∴ x ≥ y

58. **I.** $\frac{3}{\sqrt{x}} + \frac{4}{\sqrt{x}} = \sqrt{x}$
⇒ 3 + 4 = x ⇒ x = 7
II. $y^3 - \frac{(7)^{7/2}}{\sqrt{y}} = 0$
⇒ $y^{7/2} = 7^{7/2}$ ⇒ y = 7
∴ x = y

59. **I.** 9x – 4x = 54.55 + 15.45
⇒ 5x = 70 ⇒ x = 14
II. $\sqrt{y + 155} = 7 + 6 = 13$
⇒ y + 155 = 169
⇒ y = 169 – 155 = 14
∴ x = y

60. **I.** $x^2 + 11x + 30 = 0$
⇒ $x^2 + 6x + 5x + 30 = 0$
⇒ x (x + 6) + 5 (x + 6) = 0
⇒ (x + 5) (x + 6) = 0
∴ x = – 5 or – 6
II. $y^2 + 7y + 12 = 0$
⇒ $y^2 + 4y + 3y + 12 = 0$
⇒ y(y + 4) + 3 (y + 4) = 0
⇒ (y + 3) (y + 4) = 0
∴ y = – 3 or – 4
Clearly, x < y

61. The pattern of the number series is :
7 × 2 + 6 = 20; 20 × 2 + 6 = 46
46 × 2 + 6 = 98
98 × 2 + 6 = 202
202 × 2 + 6 = 404 + 6 = **410**

Send your feedback to
pratibhadesk@eenadu.net

62. The pattern of the number series is :
$210 - 1^3 = 209$
$209 + 2^2 = 213$
$213 - 3^3 = 186$
$186 + 4^2 = 202$
$202 - 5^3 = 202 - 125 =$ **77**

63. (5) The pattern of the number series is :
27 + 11 = 38
38 + 33 = 71
71 + 55 = 126
126 + 77 = 203
203 + 99 = **302**

64. (3) The pattern of the number series is :
435 – 9 × 9 = 354
354 – 9 × 8 = 282
282 – 9 × 7 = 219
219 – 9 × 6 = 165
165 – 9 × 5 = **120**

65. (3) The pattern of the number series is :
$4 + 14^2 = 4 + 196 = 200$
$200 + 13^2 = 200 + 169 = 369$
$369 + 12^2 = 369 + 144 = 513$
$513 + 11^2 = 513 + 121 = 634$
$634 + 10^2 = 634 + 100 =$ **734**

Calculations (66 – 70):
∴ 25% = 75
∴ 100% $= \frac{75}{25} \times 100 = 300$
∴ Total females = 300
Computer Science ⇒ $\frac{300 \times 35}{100} = 105$
Civil Engineering ⇒ $\frac{300 \times 5}{100} = 15$
Electrical Engineering ⇒ $\frac{300 \times 20}{100} = 60$
Mechanical Engineering ⇒ $\frac{300 \times 15}{100} = 45$
Bio-technology = 75
Total males = 700 – 300 = 400
Computer Science ⇒ $\frac{400 \times 30}{100} = 120$
Civil Engineering ⇒ $\frac{400 \times 15}{100} = 60$
Electrical Engineering ⇒ $\frac{400 \times 18}{100} = 72$
Mechanical Engineering ⇒ $\frac{400 \times 12}{100} = 48$
Bio-technology = $400 \times \frac{25}{100} = 100$

66. Required percent $= \left(\frac{100 - 75}{75}\right) \times 100$
$= \frac{100}{3} = 33\frac{1}{3}\%$

67. Required ratio = 120 : 105 = 8 : 7

68. Required difference
= 72 + 48 – 60 – 45 = 15

69. Civil Engineering + Computer Science :
Total students = 105 + 15 + 120 + 60 = 300
Male students = 180
∴ Required percent $= \frac{180}{300} \times 100 = 60$

70. Required average
$= \frac{45 + 75 + 48 + 100}{2} = \frac{268}{2} = 134$

71. ? = 466 + 765 – 212 = 1019
∴ Required answer = 1020

72. $? = \frac{150 \times 150}{100} + 150$
= 225 + 150 = 375

73. $? = \frac{300 \times 750}{1000} - 1400$
= 2250 – 1400 = 850

74. ? = 51 – 34 + 21 = 38
∴ Required answer = 40

75. $? = \frac{900}{30} \times \frac{90}{300} \times \frac{600}{50} = 108$
∴ Required answer = 110

76. C.P. of wrist watch
$= \frac{100}{100 - \text{loss\%}} \times$ S.P.
= Rs. $\left(\frac{100}{75} \times 2400\right)$ = Rs. 3200
∴ Required S.P. of wrist watch =
Rs. $\left(\frac{125}{100} \times 3200\right)$
= Rs. 4000

77. Fifth number
= 5 × 56 – 4 × 54 = 280 – 216 = 64

78. Let the number be x.
∴ $x + \frac{7}{9} \times \frac{35}{100} \times 900 = 325$
⇒ x + 245 = 325
⇒ x = 325 – 245 = 80

79. x + 4x + 5x + 60 = 360"
⇒ 10 x = 300° ⇒ x = 30
∴ Required difference = 5x – x
= 4x = 4 × 30 = 120"

80. On dividing 1740 by 88,
the remainder = 68
∴ Required number = 68.

This model paper was prepared by subject experts of RACE Institute, Hyderabad

హాయ్! బుజ్జీ!!



మన జీవిత లక్ష్యం ఆనందం కాదు, దానికి తగిన అర్హత సంపాదించుకోవడం

- ఎమర్సన్



రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

పదసంపద!

- push = తోయు
- మకరం = మొసలి

కథ



ధ్రువ ప్రాంత ఎలుగుబంట్లు వాసన చూడటంలో మహా దిట్టలు. ఆహారం మంచులో దాగి ఉన్నా ఇవి 20 మైళ్ల దూరం నుంచే పసిగట్టేస్తాయి.

ఒక అరటి పండ్లు అమ్మే వాడి డబ్బుల డబ్బాలోకొచ్చి పడిందో పది రూపాయల కాగితం. సరికొత్తగా మెరిసిపోతోంది. అయితే దాని ముఖంలో విచారం పరుచుకుని ఉంది.

ఆ డబ్బాలో ఉన్న మిగతా డబ్బు కాగితాలు, నాణేలు మొదట ఈ కొత్త నేస్తాన్ని కుతూహలంగా చూశాయి. దాని దిగులు ముఖం చూసి ఏమైందని అడిగాయి.

నోటు పాట్లు!

''ఊహ తెలిసినప్పటి నుంచి ఒక ఇనుప పెట్టెలో ఊపి రాడక బతికాను. ఈ రోజు ఒక షావుకారు దయవల్ల బయట పడ్డాను. ఊపిరి పీల్చుకోబోయానో లేదో అతగాడు నన్ను ఒక బిచ్చగత్తె జోలెలో పడేశాడు. ఆమె దగ్గరున్న సొట్టలు పడిన సత్తు గిన్నెలోకి చేరుకున్నాను. అలాంటి చోట బతకాలంటే ఎంత కంపరమనిపించిందో. ఇంతలో ఆమె అరటిపండ్లు కొనడంతో మళ్లీ ఈ పెట్టెలో కొచ్చి పడ్డాను. మళ్లీ చీకటి, ఇరుకు, ఉక్కపోత. ఇక్కడి నుంచి ఎవడి చెమట జేబులోకి వెళ్తానో, వాడు నన్ను ఎవరి పరం చేస్తాడో, ఇలా ఎన్ని చేతులు మారాలో తలుచుకుంటేనే గాబరాగా ఉంది''. అని వాపోయింది.

పక్క డబ్బులన్నీ దీని వాలకానికి నిరుత్సాహ పడ్డాయి. ఇక దాని జోలికి పోకుండా తమలో తాము కబుర్లాడుకోసాగాయి.

ఇంతలో ఆ పెట్టెలోకి చేరింది మరో పది కాగితం. చాలా ముడతలు పడి మురికిగా, చిరగడానికి సిద్ధంగా ఉన్నట్లుంది. అయితే దాని ముఖం కళకళలాడుతోంది. వచ్చిన కాసేపటికే అన్ని రకాల డబ్బులనూ నవ్విస్తూ వాటికి మంచి నేస్తమయిపోయింది.

ఈ కొత్త కాగితాన్ని కూడా పలకరించింది. కానీ అది నవ్వలేదు సరికదా! మరింత ముఖం ముడుచుకుని 'మాసిపోయిన నీ వాలకం చూస్తుంటే కొన్నాళ్లకి నా గతీ ఇంతేనేమో అని ఏడుపొస్తోంది' అంది దీనంగా.


నవ్వుతూ వింటున్న పాత నోటుని నీకథేమిటంది ఆగలేక.

'మొదట నేనూ కొన్నాళ్లపాటు ఇనపపెట్టెలో ఊపిరాడకుండానే ఉన్నాను. కానీ ఒక కుటుంబానికి భద్రతనిస్తున్నాననే ఆనందంతో బాధ అనిపించలేదు. ఈ రోజు ఒక చెప్పులు కుట్టే మనిషి చేతికి వచ్చాను. ఇందాక అతను తన వణుకుతున్న చేతులతో చెమటతో తడిచిన జేబులోంచి నన్ను తీసి ఇచ్చి అరటిపళ్లు కొని ఒకటి ఆత్రంగా తిన్నాడు. అతని ఆకలి తీర్చగలిగాననే ఆనందం ఎంత బాగుందో! ఎండ రివో చెమట, మురికి అంటుకుని ఇలా అయిపోయాను. నా జీవితంలో ఎన్ని మలుపులో! ఎన్ని మజిలీలో! అయినా నాకు అడుగడుగునా ఆనందమే'. చెబుతున్న పాత నోటును ఒక చెయ్యి పైకి లాగింది.


'మరెవరి అవసరమో తీర్చే అవకాశం మళ్లీ వచ్చింది నాకు. టాటా' అని వీడ్కోలు పలుకుతూ వెళ్లిపోయింది పాత నోటు.

అసలైన ఆనందం తారసపడిన పరిస్థితుల్ని బట్టి కాదు, అలవరుచుకున్న వైఖరిని బట్టి ఉంటుందని తెలుసుకుంది కొత్తనోటు. దాని మనసు కలత తీరి తేటపడింది.

- గుడిపూడి రాధికారాణి



కొండల్లో ఇల్లంట.. ప్రపంచంలో మిన్నంట!!



ప్రపంచంలో ఎత్తయిన ఆకాశహర్మ్యం ఏదంటే... బుర్జ్‌ఖలీఫా అని ఠక్కున చెప్పేస్తాం. మరి ప్రపంచంలో ఎత్తయిన ఇల్లేదంటే చెప్పగలరా? తెలియకపోతే ఇది చదివేయాల్సిందే.

- మనం పది పదిహేను అంతస్తులుండే అపార్ట్‌మెంట్లు బోలెడు చూస్తుంటాం. అందులో చాలా కుటుంబాలు నివాసముంటాయి. అయితే ప్రపంచంలో ఒకే కుటుంబం ఉండే ఎత్తయిన ఇల్లొకటుంది. పేరు 'ఫాల్కన్ నెస్ట్'.
- అమెరికాలో ఆరిజోనా రాష్ట్రం ఉంది. అక్కడన్నీ చాలామటుకు రాతి కొండలు. అలాంటి చోటుందీ ఇల్లు.
- ఇది 6,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. 10 అంతస్తుల్లో ఉన్న దీని ఎత్తు 124 అడుగులు. అంటే ఓ పన్నెండు అంతస్తుల అపార్ట్‌మెంట్ అంత.
- ఈ ఇంట్లోంచి 360 డిగ్రీల్లో చుట్టూ ఏ ప్రదేశమైనా చక్కగా కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆరిజోనా పక్క రాష్ట్రం కాలిఫోర్నియాలోని పర్వతాలు సైతం ఈ ఇంట్లోకి కనిపిస్తాయి. దీని నిర్మాణమే ఆ రకంగా చేశారన్నమాట.
- ఇంత పెద్ద ఇంట్లో బోలెడన్ని పడకగదులు ఉంటాయనుకుంటారేమో. దీంట్లో ఉన్నది మూడు పడకగదులు, నాలుగు బాత్రూమ్‌లే. మిగిలిన స్థలమంతా బయటి ప్రకృతి అందాలు ఎక్కడికక్కడ కనిపించేలా అద్దాలతో ఉంటుంది.
- ఇల్లు వేసవిలో చల్లగా, శీతకాలంలో వెచ్చగా ఉండేలా ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంది.
- దీని యజమాని ఎంతో ఇష్టంతో 1994లో దీన్నిలా కట్టించుకున్నారు. ఆయన భార్య చనిపోవడంతో ఇప్పుడు దీన్ని అమ్మకానికి పెట్టారు. ప్రపంచంలోనే ఎత్తయిన ఇల్లు అమ్మకానికి వచ్చిందంటూ ఇది ఇప్పుడు మళ్లీ వార్తల్లోకొచ్చింది.

నవ్వుల జల్లులు!



టీచర్: హోం వర్కులో ఎవరైనా తప్పులు చేస్తే వాళ్లకు రేపు గట్టిగా దెబ్బలు పడతాయి...

చింటు: అయితే రేపు మా అన్నను తప్పకుండా తీసుకొస్తాను టీచర్!

- జీవీయస్ ప్రియంవద, అరసవెల్లి



భార్య: ఏవండీ నేనీరోజు గారెలు చేశాను...

భర్త: అయితే పళ్ల డాక్టరు అపాయింట్‌మెంట్ తీసుకొస్తాను..

భార్య: ఎందుకండీ?

భర్త: అవి తిన్నా, తినకపోయినా తర్వాత ఏం జరుగుతుందో నాకు తెలుసు కాబట్టి!

- అంజి, చౌడేపల్లి

జతపరచండి!

ఇక్కడ సినిమా పేర్లు అసంపూర్ణంగా ఉన్నాయి. పక్కనున్న పదాల్లో ఏది సరిపోతుందో కనిపెట్టి జత చేయగలరా?


1. స్వామి	ఎ. కోరి
2. ఇట్లు	బి. వేడుక చూద్దాం
3. రారండోయ్	సి. రారా
4. నిన్ను	డి. శ్రావణి సుబ్రమణ్యం

చిలిపి ప్రశ్న

రాత్రిళ్లు కూడా పగలు కనిపించేదెప్పుడు?

- ఎ. వెంకట అమ్మిరాజు, పేరూరు

దారేది?



గబగబా అనండి

నత్త నడక
చిరుత ఉరక

- ఎం.సాయిచేతన్, హైదరాబాద్

ఎవరు నేను?

నేను ఏడక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలో 1,3,6,7 అక్షరాలు కలిపితే పద్యం అని అర్థం, 2,3,5,6– పాత్ర, 7,3,4– గుంపు అని అర్థం. ఇంతకీ నేనెవరిని?

1	2	3	4	5	6	7

జవాబులు: చిలిపి ప్రశ్న: కలలొచ్చినప్పుడు!
ఏది భిన్నం: c జతపరచండి: 1.డి 2.ఎ
3.బి 4.సి ఎవరు నేను: Problem

ఏది భిన్నం?



పాఠశాల స్థలం ఆక్రమించినవారిపై చర్యకు డిమాండ్

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకుని ప్రైవేటు ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి ఎన్. రమేష్ డిమాండ్ చేశారు. ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సంఘ స్థానిక బాధ్యులతో కలిసి స్థానిక ఆర్డీఓకు వినతిపత్రం అందించేందుకు కార్యాలయానికి వెళ్లగా ఆర్డీఓ సెలవులో ఉండడంతో కార్యాలయ తలుపులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థలం ఆక్రమించుకుని ఆసుపత్రిని నిర్మిస్తున్నారని పాఠశాల ఉపాధ్యాయులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతీ వారికి చెప్పడంతో మూడు నెలలు పనులు నిలిపివేయించినా ఆ తరువాత ఓ ప్రజాప్రతినిధి ద్వారా ఒత్తిడి రావడంతో తిరిగి పనులు ప్రారంభించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకున్నవారిపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన తప్పదన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, స్థానిక బాధ్యులు ఈశ్వర్‌గౌడ్, అనిల్‌యాదవ్, నిఖిల్, సంతోష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి డిమాండ్

సంగారెడ్డి టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ మండల సమాఖ్య అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం సమ్మెలో భాగంగా బుధవారం విధులు బహిష్కరించి పరిపాలన కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు సెలవులతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. సెర్ప్ హెచ్‌ఆర్ పాలసీని వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శోభన్, నాయకులు మహేశ్, పద్మ, ప్రభ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐకేపీ సిబ్బంది

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శిరిడిసాయి అనుగ్రహం కోసం గురువారం పాటించాల్సిన నియమాలు...?, ఇంట్లో ఉండాల్సిన లక్ష్మీప్రదమైన వస్తువులు.., 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: జగన్మోహిని (నరసింహరాజు, ప్రభ).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': ఘుమ ఘుమలు 'చెనా బీట్‌రూట్ మసాలా', మీచేతి వంట 'పాలక్‌పకోడీ కర్రీ', 'బీరకాయ బొబ్బర్ల కర్రీ', జస్ట్ ఎ మినిట్ 'క్యాబేజ్ శాండ్‌విచ్' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: జీన్స్-2(రిపీట్), 05-30: ఆడాళ్ళా మజాకా: (రావులపాలెం అతివల అల్లరి ఆటల సందడి), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ (ఖతర్నాక్ కామెడీ షో): వినోదాల విందు... 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డీజే రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం 04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డీజే
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
- ★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ.09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
- ★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ.10:00, మ. 2:30, రా. 9:30).
- ★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగల దోపిడి (కృష్ణ, దీప), 10-00: మార్నింగ్ షో: అమ్మో బొమ్మ (రాజేంద్ర ప్రసాద్, ఉమా శంకరి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: వంశానికొక్కడు (బాలకృష్ణ, ఆమని), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: దేవా ది గ్రేట్ (సత్యరాజ్, భానుప్రియ), రాత్రి: 7-00: ఫస్ట్ షో: పంతాలు – పట్టింపులు (శోభన్‌బాబు, వాణిశ్రీ), 10-00: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఎగ్ ఇడ్లీ శాండ్విచ్ & హార్స్ గ్రామ్ సలాడ్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఓట్స్ అండ్ వెజిటబుల్ బాత్ & ఓట్స్ లీఫీ అండ్ ఆలూ పరోటా, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – చల్ల ఉండలు & స్వీట్ పనియారం, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – మంగుళూర్ బన్స్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – పాలక్ రాజ్మా కర్రీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - సగ్గుబియ్యం పెరుగు వడలు & టమోట రోటి పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (గోవన్ – హిందు క్యూసైన్) - గోవన్ కోకోనట్ కేక్, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – పాలకాయలు, మ.12.30, రా.8.45: "కా అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - పొట్లకాయ వడ కర్రీ, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ఆచారి రోస్టెడ్ చికెన్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (స్కివర్స్ స్పెషల్) – ఆహతీర్ తుకా హష్య & బోహేమనియన్ డ్రెస్సింగ్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - శెనగల బిళ్ళల కర్రీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – తెరియాకి చికెన్, మ.2.30: చోటా షెఫ్ – ఎగ్ పకోడి, సా.5.15: స్నాక్స్ – టమాటో పాస్తా.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: కడుపులో సునామీ... **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ షిర్డీసాయిబాబా మందిరం సుజాతానగర్, విశాఖపట్నం, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, దేశ్‌ముఖ్, రంగారెడ్డి జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: కడుపులో సునామీ... 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 17-08-2017

SVBC (TTD) – **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగళు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 అష్టలక్ష్మి అనుగ్రహం శ్రీ మాచిరాజు కిరణ్, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + లక్ష్మీ నృసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 మహాలక్ష్మి వైభవం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం..

భక్తి TV – **ఉదయం:** 06-00 సాయి హారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 లక్ష్మీ వైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 05-30 సాయిగీతామృతం, 06-00 సద్గురుస్తోత్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

Z తెలుగు – **ఉదయం:** 07-30 శుభమస్తు, 08-00 సినిమా: రెడీ, 11-00 కామెడీ ఖిలాడీలు (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడీ ఖిలాడీలు, 05-00 జైకృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: తులసి.

maa – **ఉదయం:** 06-30 సిల్వర్‌స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 దిన ఫలం - రాశి ఫలాలు, 08-30 ఫన్‌టైమ్, 09-00 సినిమా: నమో వెంకటేశ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమపువ్వు, 02-30 బిగ్ బాస్ రిపీట్, 04-00 సినిమా: ఊహలు గుసగుసలాడే, **సాయంత్రం:** 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్ .

GEMINI – **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ముగ్గురు మొనగాళ్ళు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: పందెంకోడి, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు,10-00 సినిమా: శౌర్యం.

జొన్న సాగులో మెలకువలు



జొన్నను ఖరీఫ్ పంటగా ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో విత్తుకోవచ్చని మండల వ్యవసాయ విస్తరణాధికారిణి హారిక తెలిపారు. నల్లరేగడి, తేలికైన ఎర్ర నేలలు అనుకూలంగా ఉంటాయన్నారు.

రకాలు: సి.ఎస్.హెచ్-5, 6, 9, 13, పి.ఎస్.హెచ్-1, ఎ.ఎస్.హెచ్-1, పి.ఎస్.వి-1, సి.ఎస్.వి-15, నంద్యాల తెల్లజొన్న 3, ఎన్.జె-2169, ఎ.జె-140 తీపిజొన్న రకాలు విత్తవచ్చు. 105 నుంచి 115 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు 15-20 కింటాళ్ల దిగుబడి వస్తుంది. సి.ఎస్.హెచ్ 5, 6, 9, 13 రకాల్లో కంకి కండె ఆకారంలో ఉండి బూజు తెగులు తట్టుకొంటాయి. అంతర పంటలను వేసుకోవచ్చు. ఎత్తు ఎక్కువగా పెరుగుతుంది. చొప్ప ఎక్కువగా వస్తుంది. కాండం తొలుచు పురుగును కొంత వరకు నివారిస్తుంది. గింజ తెల్లగా ఉంటుంది.

విత్తనం: ఎకరాకు 4 కిలోలు సరిపోతుంది.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

విత్తే ఎడం : వరుసల మధ్య 45 సెం.మీ, వరుసలో మొక్కల మధ్య 12-15 సెం.మీ. దూరంలో విత్తాలి.

ఎరువులు: పశువుల ఎరువు ఎకరాకు 4 టన్నులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరాన్ని విత్తేటప్పుడు, పంట మోకాలు ఎత్తు పెరిగినప్పుడు.. 12 కిలోల నత్రజనిని పైపాటుగా వేయాలి.

నీటి యాజమాన్యం : తేలిక నేలల్లో వారానికి ఒకసారి, నల్లరేగడి భూముల్లో 15 రోజులకొకసారి తడి ఇవ్వాలి. పంట పూత, గింజ పాలు పోసుకునే సమయంలో నీరు తప్పకపెట్టాలి.

అంతర పంటలు : జొన్న, కందిలను 2:1 నిష్పత్తిలో వేసుకోవచ్చు.

అంతరకృషి : విత్తిన 30 రోజులకు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయడం వల్ల పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసేయాలి. విత్తిన తదుపరి కలుపు నివారణకు.. ఎకరాకు కిలో పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 3 రోజుల్లోపు పిచికారి చేయాలి. విత్తిన 15-20 రోజుల వ్యవధిలో 2, 4-డి ఎకరాకు 800 గ్రా., 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, సదాశివనగర్

కనకాంబరానికి పురుగుల బెడద



కనకాంబరంలో పురుగుల బెడద ఎక్కువని ఉద్యాన అధికారి ఎం.బబిత తెలిపారు. నివారణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు.

నులి పురుగులు: ఇవి మొక్కల వేర్లకు రంధ్రాలు చేసి బుడిపెలను కలుగజేస్తాయి. దీని వల్ల వేర్లు నీటిని, పోషకాలను కావాల్సిన మేర మొక్కకు అందించలేవు. అందు వల్ల ఆకులు ముడుచుకుని ఊదారంగుకు మారుతాయి. మొక్కలు గిడసబారతాయి. పూల పరిమాణం తగ్గుతుంది. నులి పురుగులు చేసిన రంధ్రాల గుండా శిలీంధ్రాలు వేర్లలోకి చేరి ఎండుతెగులు సోకే అవకాశం ఉంది. మొక్కలు ఎండిపోతాయి.

నివారణ చర్యగా నులిపురుగులున్న పొలంలో కనకాంబరం పూలసాగు చేపట్టే ముందు, సూర్యరశ్మీకరణ చేయాలి. నాటేముందు ఎకరాకు 200 కిలోల వేప పిండి వేసుకోవాలి. నాలుగు కిలోల ఫోరేట్ లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకతో కలిపి చల్లాలి. నులిపురుగులు సోకిన మొక్కల్ని పెరికి నాశనం చేయాలి. బంతి పూలతో పంటమార్పిడి చేస్తే నేలలో నులిపురుగుల సంఖ్య తగ్గుతుంది.

పిండినల్లి: లేత కొమ్మలు, ఆకులు, పూమొగ్గలపై తెల్లని పొర కప్పినట్టుగా ఉండే పురుగులు గుంపులుగా చేరి రసంపీల్చడంతో ఆకులు పసుపురంగుకు మారి మొక్కలు గిడసబారతాయి. ఇవి విసర్జించే తియ్యని పదార్థంపై నల్లని బూజు పెరుగుతుంది. దీని వల్ల ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియ జరగక మొక్కల పెరుగుదల తగ్గుతుంది. నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ కలిపిన ద్రావణాన్ని రెండుసార్లు 15 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఈ తెగులు సోకిన నారు నాటడం లేదా సాగుచేసిన పొలంలో శిలీంధ్రాలు ఉండటం వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. ఈ శిలీంధ్రానికి నులి పురుగులు తోడైనప్పుడు మొక్కలు తొందరగా ఎండిపోతాయి. ఆకులు ముందుగా కిందికి వాలుతాయి. తరువాత పసుపు రంగుకు మారి కొమ్మల చివర్లు కిందికి వంగుతాయి. మొదట వేర్ల చివర్ల వద్ద తర్వాత నేల మట్టం వద్ద కాండం కుళ్లిపోతుంది. దీన్ని కాండంకుళ్లు అంటారు. లీటరు నీటికి 3 గ్రా. కాంటాఫ్ కలిపిన ద్రావణాన్ని మొక్క మొదలు చుట్టూ భూమి తడిచేలా పోసి ఎండు తెగులును నివారించవచ్చు.

కొత్త పరిశ్రమల కళ!



నందిగామలో పారిశ్రామికవాడ



కొల్లూరులో సేకరించనున్న భూమి

బాహ్య వలయం చుట్టూ భూ కేటాయింపులు • ఐటీ తరహా కంపెనీలకు ఎర్రతివాచీ వేస్తున్న సర్కారు

న్యూస్‌టుడే, పటాన్‌చెరు

జిల్లా ముఖద్వారంలో ఐటీ శోభ తీసుకురావడానికి సర్కారు రంగం సిద్ధం చేస్తోంది. హైటెక్ సిటీ తరహాలో పరిశ్రమల ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. భూ కేటాయింపులు చేస్తున్నారు. నగరానికి కూతవేటు దూరంలో ఈ పరిశ్రమలు ఉండాలనే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రత్యేకంగా పారిశ్రామికవాడలు రూపుదిద్దుకుంటున్నాయి. ఇవీ వివరాలు....

పటాన్‌చెరు, రామచంద్రాపురం మండల గ్రామాలు హైదరాబాద్ శివారు ప్రాంతాలుగా ఉన్నాయి. వీటికి పూర్తిగా బాహ్యవలయ రహదారి అనుసంధానంగా ఉంది. ఇక్కడ మూడు జంక్షన్‌లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కాలుష్యరహిత పరిశ్రమలు నెలకొల్పేటట్టు ప్రణాళికలు వేస్తున్నారు. ఈ క్రమంలో పరిశ్రమల్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ముందుగా ప్రయోగాత్మకంగా సుల్తాన్‌పూర్ గ్రామంలో 471 ఎకరాల్లో ఐటీ తరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దీన్ని ఇప్పటికే ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. దీనిలో జాతీయ అంతర్జాతీయస్థాయి ఐటీ పరిశ్రమలకు స్థానం కల్పిస్తున్నారు. పారిశ్రామికవేత్తలకు వెయి గజాల నుంచి ఐదు ఎకరాల వరకు స్థలకేటాయింపులు జరుపుతున్నారు. అలానే నందిగామ గ్రామంలో 83 ఎకరాల్లో మహిళలకు సంబంధించి గ్రీన్‌పార్కు పారిశ్రామికవాడను నెలకొల్పుతున్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా, కార్మికులు, ఉద్యోగులు ఇలా అన్ని రంగాల్లో ఉండేటట్టు ఏర్పాట్లు చేశారు. మహిళలకు శిక్షణలు ఇచ్చేందుకు బీడీఎల్ పరిశ్రమతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దాదాపు 210 పరిశ్రమలు రానున్నాయి. ఇప్పటికే రహదారుల నిర్మాణాలు పూర్తి చేశారు. పూర్తిగా సౌరశక్తి ఆధారిత విద్యుత్తును వినియోగం జరిపేటట్టు ప్యానళ్ల ఏర్పాటు చేస్తున్నారు. రామచంద్రాపురం కొల్లూరు గ్రామంలో ఔటర్‌కు ఆనుకొని ఐటీ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయించేట్టు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీన్ని ఐటీ కారిడార్‌గా మార్చడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన భూసేకరణ జరపడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రెండు పడకగదుల ఇళ్ల నిర్మించడానికి 95 ఎకరాల భూమిని సేకరించారు. ఇందుకు ఎకరాకి రూ.35లక్షలు చొప్పున చెల్లింపులు చేశారు. అదే రీతిలో మరో 350 ఎకరాల భూమి సేకరిస్తున్నారు. దీన్ని పూర్తిగా పారిశ్రామిక జోన్‌గా మార్చనున్నారు. టీఎస్ఐఐసీకి భూమిని అప్పగించి పరిశ్రమలకు భూకేటాయింపులు చేస్తున్నారు. వెలిమెల గ్రామంలో రంగారెడ్డి జిల్లా కొండకల్ శివారు వెలిమెల గ్రామంలో 55 ఎకరాల భూమిని రైల్వే కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారికి కేటాయింపులు జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పరిశ్రమలకు సంబంధించిన సరకులు రవాణా చేయడానికి వ్యాగన్‌లు నిల్వ ఉంచడానికి గోదాం నిర్మాణం చేపట్టనున్నారు. వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని అధికారులు లెక్కలు వేస్తున్నారు. రుద్రారం గ్రామానికి ప్రత్యేక పారిశ్రామికవాడగా ప్రభుత్వం ప్రకటించింది. కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటు చేయించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

30 రోజుల్లో రాయితీ మంజూరు

పరిశ్రమలు నెలకొల్పే వారికి వివిధ రకాల రాయితీలు ఇవ్వడం సహజమే. యంత్రాలపై పెట్టుబడి, అమ్మకం పన్ను, రిజిస్ట్రేషన్ రుసుం, విద్యుత్తు బిల్లులు వంటివాటిల్లో రాయితీలు అవకాశాలు ఉన్నాయి. ఇందుకు మీసేవలో దరఖాస్తు చేసి సంబంధిత పత్రాలతో రాయితీ మంజూరుకు పరిశ్రమలశాఖ చుట్టూ తిరగాల్సి వచ్చేది. తాజాగా ఈ పద్ధతికి స్వస్తి చెప్పి విధానాలు సరళీకరించారు. పరిశ్రమ యజమాని సంబంధిత పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. జీఎం స్థాయి అధికారి పత్రాలు చూస్తారు. క్షేత్ర అధికారిని పరిశీలనకు పంపుతారు. ఆయా పరిశీలన పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీన్ని జీఎం పరిశీలన చేసి అన్నీ సక్రమంగా ఉంటే 30రోజుల్లో ఆమోదం పొందాల్సి ఉంటుంది.

లక్ష్యాలు నిర్దేశించుకోండి



మాట్లాడుతున్న వీరేందర్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: లక్ష్యాలు లేక యువత పెడదారి పడుతోందని, దృఢ సంకల్పంతో లక్ష్యాలను నిర్దేశించుకుని ఛేదించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వీరేందర్ అన్నారు. సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ-పీజీ కళాశాలలో టీఎస్‌కేసీ(తెలంగాణ స్కిల్ నాలెడ్జి సెంటర్) ఆధ్వర్యంలో విద్యార్థులకు 'వ్యక్తిత్వ వికాసం - మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు' పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . విజయానికి మంచి ఆలోచనలే ప్రధానమని, అనవసరమైన ఆలోచనలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాలను సులువుగా చేరుకునే సత్తా యువతలో ఉంటుందన్నారు. టీఎస్‌కేసీ సమన్వయకర్త నాగుల వేణు మాట్లాడుతూ.. విద్యార్థులు న్యూనతాభావాన్ని వీడితే అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. విద్యార్థులు విద్య, విజ్ఞానంతో పాటు నైతిక విలువలు, ధర్మాలు నేర్చుకుని ఆచరించాలన్నారు. అధ్యాపకులు హరినాథశర్మ, హుస్సేన్, సుదర్శనం, రామాచారి, బేబి రమణి, నవీన్, అనురాధ, దుర్గాప్రసాద్, సువర్ణాదేవి తదితరులున్నారు.

ఉద్యోగ ప్రకటనపై హర్షం



సిద్దిపేటలో తెరాసవి ఆధ్వర్యంలో కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

సిద్దిపేట, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెరాసవి జిల్లా సమన్వయకర్త మేర్గు మహేశ్ అన్నారు. తాజాగా టీఎస్‌పీఎస్సీ 9 ఉద్యోగ ప్రకటనలు జారీ చేయడంతో తెరాసవి ఆధ్వర్యంలో సిద్దిపేటలో బుధవారం కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది 84,876 ఉద్యోగాల భర్తీకి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 294 గురుకుల పాఠశాలలు ఉంటే.. తెరాస అధికారం చేపట్టాక కొత్తగా 516 గురుకులాలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో సన్నబియ్యంతో అన్నం పెడుతోందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో మంత్రి హరీశ్‌రావు కృషితో ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం అవుతోందన్నారు. కార్యక్రమంలో తెరాసవి నేతలు రామ్మోహన్, భిక్షపతినాయక్, నాగరాజు, రమేశ్, బాలు, వంశీ తదితరులున్నారు.

స్వచ్ఛ భారత్‌ను విజయవంతం చేయాలి

కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ

కాచిగూడ, న్యూస్‌టుడే: పార్టీలకు అతీతంగా స్వచ్ఛ భారత్‌ను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ కోరారు. బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తమ తమ ప్రాంతాల్లో పరిసరాల పారిశుద్ధ్యంలో భాగస్వాములు కావాలని కోరారు. పారిశుద్ధ్యంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశాన్ని నిర్వహించారని, తర్వాత ఏమైందో తెలియదన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో చాలా చోట్ల చెత్త పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోందన్నారు. నగరంలో వేస్ట్‌మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టి రహదారుల పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. రైల్వేలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. రైల్వే స్టేషన్లు, ప్లాట్‌ఫారాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రయాణికులు సహకరించాలని కోరారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ... రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో ఈ నెల 16 నుంచి 31 వరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పారిశుద్ధ్య లోపాలను సవరించుకుని ముందుకెళుతామన్నారు. కార్యక్రమంలో భాజపా శాసనసభాపక్ష నేత, ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి, డీఆర్ఎం అరుణ్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడ రైల్వే ఆవరణను శుభ్రం చేస్తున్న దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, వినోద్‌కుమార్‌యాదవ్ తదితరులు